ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 25 జనవరి 2025



ఆ కార్యాలయంలో ఆయన చెప్పిందే వినాలి. ఎదురు తిరిగారో ఇక వారికి చుక్కలు చూపిస్తాడు. సిబ్బంది వీక్‌నెస్‌ను కనుక్కొని.. వారిపై పీజీఆర్ఎస్‌లో ఇతరుల ద్వారా అర్జీలు పెట్టిస్తాడు. కుదరకపోతే తన మనుషుల ద్వారా ఆర్టీఐ యాక్టు ద్వారా అడిగించి మరీ ఇబ్బంది పెడతాడు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు ఆయనకు అనుకూలంగా లేకపోతే కాళ్ల బేరాలకు వచ్చేదాకా వదలడు.. ఎవరైనా ఈయనపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరు వద్దకు వెళ్లే ప్రయత్నం చేస్తే వారి గురించి ఆరా తీసి నయానో.. భయానో.. సెటిల్‌మెంటు చేసుకొని ఫిర్యాదులు వెళ్లకుండా అడ్డుకోవడం వెన్నతో పెట్టిన విద్య. ఈయన ఆగడాలు భరించలేని సిబ్బంది.. ఇతన్ని మాతృశాఖకు ఎప్పుడు పంపుతారా అని ఎదురుచూస్తున్నారు.

- పట్టుపడితే పైసలివ్వాల్సిందే
- సిబ్బంది తప్పిదాలే పరమావధిగా..
- ఫోన్‌పేలలో లావాదేవీలు
- పీజీఆర్ఎస్‌లో

ఫిర్యాదు చేయించి మరీ వసూళ్లు

ఆయనో కలెక్షన్ కింగ్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ఏవోగా పనిచేసే ఓ అధికారి కలెక్షన్ కింగ్‌లా తయారయ్యాడు. తన కింది స్థాయి ఉద్యోగుల తప్పిదాలను పరమావధిగా చేసుకుని లక్షల్లో భోంచేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. కుదిరితే డైరెక్టుగా ఆఫీసుకు పిలుపించుకుని వసూలు చేయడం.. లేదంటే ఫోన్‌పేలలో లావాదేవీలు జరుపుతూ అక్రమ సంపాదనకు తెరతీస్తున్నట్లు సమాచారం. గతంలో ఉన్న డీపీవో ధనలక్ష్మి ఆయనను సంబేపల్లె ఈవోపీఆర్‌డీగా పంపిస్తే.. ఆయన తనదైన శైలిలో చక్రం తిప్పి, డీపీవో ఆఫీస్ ఏవోగా మళ్లీ పాగా వేశారు. వారం క్రితం ప్రస్తుతం ఉన్న డీపీవో బాలక్రిష్ణారెడ్డి సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా తీసుకున్న ఈయన తనదైన శైలిలో జిల్లాలో ఉన్న బిల్‌కలెక్టర్ దగ్గర నుంచి డీఎల్‌డీవోలో పనిచేస్తున్న సిబ్బంది వరకు మామూళ్లకు తెరలేపినట్లు తెలిసింది. ముడుపులు ఇచ్చేదాకా వదలకుండా తన మనుషుల ద్వారా పీజీఆర్ఎస్‌లో అర్జీలు పెట్టి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. జిల్లాలో మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది ద్వారా ఈవోపీఆర్‌డీలు, డీఎల్పీవోలు, పంచాయతీ సెక్రటరీలు ఏం చేస్తున్నారనే సమాచారం పసిగట్టి వారిపైన ఓ అజ్ఞాత వ్యక్తి ద్వారా పీజీ ఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయిస్తున్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత సంబంధిత అధికారికి ఫోన్ చేసి 'మీపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు వచ్చింది.. ఆఫీస్‌కు రండి మాట్లాడుకుందాం' అని పిలుస్తాడు. కుదిరితే ఫోన్‌పేలో అయినా సరే మామూళ్లు పంపించండి అని ఆదేశిస్తారని కొందరు సెక్రటరీలు వాపోతున్నారు. ఈ విషయంపై ఆలస్యం చేస్తే వారిపై బూతు పురాణం అందుకుంటాడని సిబ్బంది చెప్పుకొస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

ఇక్కడ సిబ్బంది కొరత కారణంగా గతంలో ఉన్న డీపీవో ఆ అధికారిని డీపీవో కార్యాలయంలో నియమించుకున్నారు. ఇతను గతంలో కడప జిల్లాలో వివిధ కేడర్లలో పనిచేశారు. జిల్లా విభజన అనంతరం ఈయన అన్నమయ్య జిల్లాకు సీనియర్ అసిస్టెంట్‌గా వచ్చారు. కొద్దికాలానికి ఈవోఆర్‌డీగా పదోన్నతి పొంది సంబేపల్లెకు వెళ్లారు. అయితే ఈయన తనదైన శైలిలో చక్రం తిప్పి మళ్లీ డీపీఓ కార్యాలయ ఏవోగా బాధ్యతలు చేపట్టారు. ఇక ఇక్కడి నుంచి అతని వసూళ్ల పర్వం జోరందుకుంది. కడపలో చాలాకాలం పనిచేయడంతో అక్కడి పరిచయాలతో ప్రొద్దుటూరులో ఉన్న ఓ అజ్ఞాత వ్యక్తి ద్వారా అన్నమయ్య జిల్లాలో పంచాయతీ సెక్రటరీలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఉన్న డీపీఓ బాలక్రిష్ణారెడ్డి సెలవులో వెళ్లిపోవడంతో ఇన్‌చార్జి డీపీవోగా రాజంపేట డీఎల్‌పీవో మస్తాన్‌వల్లిని అధికారులు నియమించారు. దీంతో ఇక ఆయన ఆగడాలకు అంతేలేకుండా పోయింది.

సిబ్బంది వీక్‌నెస్‌ను గుర్తించి ప్రతి ఒక్క డీఎల్‌పీవో, పంచాయతీ సెక్రటరీలకు ఆర్డర్లు వేస్తూ మీపైన ఫిర్యాదులు వచ్చాయి.. ఎండార్స్‌మెంటు ఇవ్వడానికి మీరు ఆఫీసుకు రావాలి అంటూ బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నాడని కొంత మంది బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. పై విషయాలపై పంచాయతీ సెక్రటరీలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళితే.. వారి సెల్‌ఫోన్ నెంబర్ కనుక్కుని వెంటనే వారికి ఫోన్ చేసి మీరు తనపై ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నట్లు తెలిసింది. రండి మనం మాట్లాడుకుందాం అని నయానో.. భయనో బెదిరించి ఉద్యోగం వెలగబెడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఇతని అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెట్టి ఈయనను మాతృశాఖకు పంపిస్తారా.. లేదా అనేది వేచి చూడాల్సిందే.

అధికారి ఏమంటున్నారంటే..

ఈ విషయంపై డీపీవో ఆఫీస్ ఏవో సునీల్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా... తాను మామూళ్ల వసూలు చేయడం అవాస్తవమని, తాను ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోలేదని వివరించారు. తనపై ఎవరో కావాలనే బురద చల్లుతున్నారని, తాను ఏ తప్పు చేయలేదని చెప్పారు.

పీలేరు వారపు సంత ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న ఈవో గురుమోహన్



పీలేరు వారపు సంతలో పారిశుధ్య పనులు

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పీలేరు వారపు సంతలో శుక్రవారం స్థానిక పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. సంత అధ్వాన స్థితిపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో "చెత్త'లో సంత' అన్న కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఆ కథనంపై పంచాయతీ ఈవో గురు మోహన్ స్పందించారు. శుక్రవారం ఉదయమే తన సిబ్బందితో సంత ప్రాంగణాన్ని శుభ్రం చేసే పనులు చేపట్టారు. గుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎక్సకవేటర్లు, ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. సంతలో మిగిలిపోయే వ్యర్థాలతో పాటు చుట్టుపక్కల ఉన్న నివాస ప్రాంతాల నుంచి కూడా సంత ప్రాంగణంలో చెత్తను డంప్ చేస్తున్నట్లు గుర్తించామని, ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకా కుండా ప్రస్తుతం నిర్మించిన ప్లాట్‌ఫామ్‌లపై షెడ్లు నిర్మించి వ్యాపారులకు అప్పగిస్తామని, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటిని త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. చాలా కాలం తరువాత సంత ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేయించడంపై పలువురు ఈవో గురుమోహన్‌ను అభినందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వంద శాతం ఫలితాల సాధనకు ప్రత్యేక చర్యలు

- జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం



ఫటాఫట్

రాయచోటిటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగబోయే టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఫలితాల సాధన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా ఎన్ని హైస్కూల్స్ ఉన్నాయి. ఎంత మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు ?

జవాబు: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, మోడల్ స్కూల్, గురుకుల, రెసిడెన్షియల్ స్కూల్స్‌తో కలిపి 507 హైస్కూల్స్ ఉండగా అందులో 21,468 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో 21,299 మంది రెగ్యులర్ విద్యార్థులు, 349 మంది ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరుకానున్నారు.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా ఎన్ని పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించారా...?

జవాబు: జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం 120 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఏ ఒక్క విద్యార్థి కూడా నేల మీద కూర్చుని పరీక్ష రాయకూడదన్న ఉద్దేశ్యంతో ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రతి విద్యార్థికి ఒక్కో బెంచ్‌లో కూర్చునే విధంగా అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నాం. అలాగే విద్యార్థులకు అన్ని విధాల లైట్స్, ఫ్యాన్లు, నీటి వసతి, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నాం.

ప్రశ్న: వంద శాతం ఫలితాల సాధన కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఫలితాల సాధన కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేశాం. ఈ ఏడాది ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను డీసీఈబీ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలకు పంపిణీ చేశాం. అలాగే ప్రతిరోజు ఉదయం 8-9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. అలాగే సెలవు రోజుల్లో ఆయా సబ్జెక్టు టీచర్ల పర్యవేక్షణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్టడీ అవర్స్ జరుగుతున్నాయి.

ప్రశ్న: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

జవాబు: ప్రతిరోజు ఆయా సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించడం ద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తిస్తూ ఏబీసీడీ గ్రేడ్లుగా విభజిస్తూ డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. ఏ ఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో ఆయా సబ్జెక్టు టీచర్లు పిల్లలపై ప్రత్యేక నిఘా ఉండేలా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించారా..?

జవాబు: జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులందరికీ నోట్ బుక్స్, టెక్స్‌బుక్, యూనిఫాం పూర్తి స్థాయిలో అందించాం. చదువు విషయంలో ఎక్కడ రాజీలేకుండా ఉత్తమ ఫలితాల సాధన కోసం అన్ని రకాల చర్యలను తీసుకుని వందశాతం ఫలితాలను సాధిస్తాం.

ఎర్రచందనం కేసులో

ముగ్గురికి కఠిన కారాగార శిక్ష

- ఒక్కొక్కరికి రూ.3 లక్షల జరిమానా : ఎస్పీ



ఎర్రచందనం కేసులో జైలు శిక్ష పడిన వారితో కేవీపల్లి పోలీసులు

రాయచోటిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కేవీపల్లి మండలం నూతన కాలువ గ్రామానికి చెందిన ముగ్గురికి ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో తిరుపతి ఆర్ఎస్ఎస్ కోర్టు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కో ముద్దాయికి రూ.3 లక్షల జరిమానా విధించినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ ను బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా పోలీసులు ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిందితులకు కఠిన శిక్షలకై గట్టి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో 2016 సంవత్సరంలో జిల్లా పరిధిలోని కేవీపల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ సుమన్ కేవీపల్లి మండలం నూతన కాలువ గ్రామం సంగటివారిపల్లెకు చెందిన సంగటి చిన్నయ్య, సంగటి సహదేవ, సంగటి వీరభద్ర అనే ముగ్గురు నిందితులను ఎర్రచందనం కేసులో పట్టుకొని కేవీపల్లి సెక్షన్ 379, 120'బీ)36చట్టాల కింద పబ్లిక్ ఆస్తికి నష్టం జరగకుండా నిరోధించే చట్టం-1985, జీవ-వైవిధ్య చట్టం-2002 సెక్షన్ 55(2), 6 బయో డైవర్సిటీ యాక్ట్-2002 కేసు నమోదు చేసి దర్యా ప్తు చేయగా తదుపరి దర్యాప్తు అధికారిగా బాధ్య తలు చేపట్టిన కేవీపల్లి ఎస్ఐ కేబీ శివకుమార్ సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. సదరు నివేదికను తిరుపతి ఆర్ఎస్ఎస్ స్పెషల్ కోర్టు సెక్షన్ నెంబరు 262/2022గా స్వీకరించి విచారణ జరిపి సదరు నిందితులకు శిక్ష విధించారు. అన్ని కోణాల్లో విచారించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు తిరుపతి జిల్లా అడిషనల్ న్యాయమూర్తి నరసింహమూర్తి పైన తెలిపిన ముగ్గురికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.3 లక్షల జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 6నెలల సాధారణ జైలు శిక్ష అనుభవిం చాల్సి ఉంటుందని తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.కోటేశ్వర్‌రెడ్డి, రెడ్‌శ్యాండిల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు బి.రాఘవరెడ్డి, మధు, అప్పటి దర్యాప్తు అధికారి కేవీపల్లి ఎస్ఐ వి.సుమన్, ఎస్ఐ కేవీ శివ కుమార్, కోర్టు కానిస్టేబుల్ ఆదినారాయణ, కోర్టు అనుసంధానం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులును ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభి నందించారు. ఎర్రచం దనం అక్రమ రవాణా చేసే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని ఎస్పీ పేర్కొన్నారు.

గీత కులాలకు 11 మద్యం షాపులు

- లాటరీ పద్ధతి ద్వారా షాపులు కేటాయించిన కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గీత కులాలకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం 11 మద్యం షాపులను కేటాయించారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ ద్వారా షాపులు ఇచ్చారు. వాటిలో పీలేరు మండలం (గాండ్ల), బి.కొత్తకోట రూరల్ (గౌడ), మదనపల్లె మున్సిపాలిటీ (ఈడిగ), రాజంపేట మున్సిపాలిటీ (ఈడిగ), తంబళ్లపల్లి మండలం (ఈడిగ), రామసముద్రం మండలం (ఈడిగ), నిమ్మనపల్లె మండలం (ఈడిగ), కలకడ మండలం (ఈడిగ), వీరబల్లి మండలం (ఈడిగ), నందలూరు మండలం (గౌడ), రాయచోటి మున్సిపాలిటీ (గౌడ)లకు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్, ఏఈఎస్ జోగేంద్ర, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సురేశ్‌బాబు, గీత కార్మిక కులాలకు చెందిన వారు పాల్గొన్నారు.



మద్యం షాపులను లాటరీ పద్ధతి ద్వారా కేటాయిస్తున్న కలెక్టర్

రైతులను మోసం చేసే డీలర్లపై కఠినచర్యలు

- వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

బి.కొత్తకోట/ములకలచెరువు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తమ స్వలాభం కోసం రైతులను మోసం చేసి, నాణ్యత లేని పురుగు మందులు, ఎరువులు విక్రయించే డీలర్లు, దుకాణదారులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తకోట పట్టణంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దుకాణాల్లో మందుల నిల్వలు, విక్రయాల బిల్లులు, కంపెనీల నుంచి కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పట్టణానికి చెందిన భవ్యశ్రీ ట్రేడర్స్‌లో సరైన బిల్లులు లేని రూ.2.90 లక్షల విలువైన మందులను, ఎంవీఆర్ సీడ్స్‌లో రూ.12 వేల మందులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ షాపుల ముందు తమ షాపులో ఏఏ ఎరువులు అందుబాటులో ఉన్నాయి, వాటి ధరలు ఎంత? అనే వివరాలతో స్టాక్‌బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పీలేరు మినహా అన్ని నియోజకవర్గాల్లో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, తంబళ్లపల్లె నియోజకవర్గానికి ములకలచెరువులో పరిశోధనా కేంద్రం ఉంటుందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయిల్ టెస్టింగ్ చేయిస్తే వ్యవసాయ పొలంలో ఉన్న లోపాలు తెలుస్తాయని, దాన్ని బట్టి ఎరువులు, మందులు వాడి మంచి దిగుబడి సాధించేందుకు వీలుంటుందని, దీన్ని రైతులు గ్రహించాలన్నారు. ఎరువులు-విత్తనాలు, పురుగుమందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, అక్రమాలు తేలితే లైసెన్స్‌లను సైతం రద్దు చేస్తామన్నారు. కాగా జేడీ రాక విషయం తెలియడంతో బి.కొత్తకోటలో పలువురు తమ దుకాణాలను మూసివేసి ముఖాలు చాటేశారు. అదేవిధంగా ములకలచెరువులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల రైతుసేవా కేంద్రాల సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయంలోని పలురికార్డులు పరిశీలించారు. జేడీ వెంట మదనపల్లె ఏడీఏ శివశంకర్, ఏవోలు ఉన్నారు.



బి.కొత్తకోటలో పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న జేడీ చంద్రానాయక్

1 నుంచి భూముల ధరల పెంపు 7

శివుని కొండలకు ఉపాధి బాటలు 6

వైసీపీతో.. విద్యారంగం అస్తవ్యస్తం

- పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం
- జీఓ 117 ఉపసంహరించుకుంటూ మార్గదర్శకాలు విడుదల
- లాభనష్టాలపై అధికారులతో చర్చ
- నేడు జోనల్‌స్థాయి సమావేశం
- హాజరుకానున్న పాఠశాల విద్య కమిషనర్



కడప ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాడు-నేడు, విద్యాదీవెన వంటి పథకాలతో పాఠశాల విద్య పురోగతి సాధించిందని వైసీపీ పాలకులు చెప్పిన గొప్పలు క్షేత్రస్థాయిలో బూటకమని తేలిపోయాయి. దేశంలో మరెక్కడా లేని విధంగా మూడు, నాలుగు, ఐదు తరగతులకు సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం కోసం తెచ్చిన జీఓ నెంబర్ 117తో ప్రాథమిక పాఠశాలలు కుదేలయ్యాయి. మూడేళ్ల క్రితం తీసుకువచ్చిన ఈ జీఓ రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రద్దు చేస్తే ఏర్పడే గందరగోళం నివారించేందుకు, పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రాథమిక విద్యకు పూర్వవైభవం తేవాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ మేరకు సంసిద్ధత మార్గదర్శకాలను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. దీనిపై కడపలో శనివారం జోనల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ హాజరుకానున్నారు.

కొత్త విద్యా విధానంలో.. మోడల్, బేసిక్, ఫౌండేషన్ ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలలుగా పాఠశాల విద్యను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి స్టాఫ్ ప్యాటర్న్ తాజా నిబంధనల ప్రకారం తయారు చేయడంతో పాటు, జిల్లా మొత్తం 47 కేటగిరీలకు సంబంధించిన టీచింగ్ పోస్టుల వివరలు మంజూరైనవి, పనిచేస్తున్నవి, మిగులు, అవసరం, డీఎస్సీ కోటా... పాఠశాలల యాజమాన్యం వారీగా లెక్కింపును తేల్చనున్నారు. వివరాలు పాత, కొత్త జిల్లాల వారీగా నిర్ణయిస్తారు. దీనితో ప్రతి జిల్లాలో ఏర్పడబోయే కొత్తరకం పాఠశాలలు, మిగులు సిబ్బంది లెక్క తేలనుంది. ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల అవసరముండగా, హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లు మిగులు జిల్లాల్లో దాదాపు 800కి దగ్గరగా ఉండే అవకాశం ఉంది. దీనితో హైస్కూల్ వ్యవస్థ అతలాకుతలం కానుంది. ప్రస్తుతం 3, 4, 5 తరగతులకు సబ్జెక్టు వారీగా ఐదుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. తిరిగి ఈ తరగతులు ప్రాథమిక పాఠశాలలకు బదలాయిస్తే 2025-26 విద్యా సంవత్సరం నుంచి అన్ని సబ్జెక్టులకు కలిపి ఒకరు లేదా ఇద్దరు ఎస్జీటీ టీచర్లు బోధిస్తారు. దీంతో సబ్జెక్టు నిపుణుల విద్యాబోధన ప్రాథమిక తరగతులకు అందదు. ఇక్కడ సబ్జెక్టు టీచర్లను నియమిస్తేనే విద్యార్థులకు న్యాయం జరగదు.

అంతా గందరగోళం

ఇక ఖాజీపేట మండలంలోని ఒక ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం జీఓ 117 ప్రకారం మూడు నుంచి పదవ తరగతి వరకు ఎనిమిది సెక్షన్లు నడుస్తున్నాయి. ఇక్కడ ప్రతి సబ్జెక్టుకు ఒక్కొక్కరు చొప్పున, గణితం, ఇంగ్లీష్‌కు ఇద్దరు చొప్పున స్కూల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. జీఓ 117 రద్దు చేయడంతో.. 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపిస్తే ఐదు సెక్షన్లు మిగులుతాయి. దీనితో ఒక గణిత, ఒక ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లతో పాటు అదనంగా ఉన్న సోషియల్, తెలుగు మిగులు అవుతారు. సదరు పాఠశాలలో మొత్తం నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తరలిపోతున్నాయి. ఇలానే మూతపడుతున్న ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి అనేక మంది స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను మిగులుగా గుర్తించనున్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 3 నుంచి 10వ తరగతి వరకు 170 మంది చదువుతున్నారు. 3, 4, 5 తరగతులు వెళ్లిపోతే 134 మంది ఉన్నత పాఠశాలలో మిగులుతారు. ఇలా జిల్లాలో ప్రతి పాఠశాలలోను మిగులు సిబ్బందే కనిపిస్తున్నారు. వీరిని సర్దుబాటు చేసేందుకు అవసరమన్న పాఠశాలలు కనుచూపుమేరలో కనిపించడం లేదు.

కలసపాడు మండలం తెల్లపాడు గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల తాజా గణాంకాలతో అప్‌గ్రేడ్ బదులు డౌన్ గ్రేడ్ అయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు మంగళం పాడే అవకాశం ఉంది. ఇది పురోభివృద్ధా, తిరోభివృద్ధా విద్యాశాఖే తేల్చుకోవాలి. ఇలాంటి పాఠశాలలు రాష్ట్రంలో అనేకం ఉన్నాయి. యూపీలు కొనసాగించే పరిస్థితి ఉంటే ఇక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను తొలగించి ఎస్జీటీలను నియమిస్తారట.. ఇదెక్కడి న్యాయమని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెరిగే అవకాశం

పాఠశాలలను వికేంద్రీకరణ చేయడం వల్ల తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారు. దీనితో విద్యార్థులకు సంపూర్ణ విద్యాబోధన జరిగి అభ్యసన సామర్థ్యాలు పెరిగే అవకాశం ఉంది. పాఠశాల లేని ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, జనాభా తక్కువ ఉన్న గ్రామాల విద్యార్థులకు రవాణా బత్యాన్ని కూడా ప్రభుత్వం ఇవ్వనుంది. దీనితో మోడల్ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అయి ప్రాథమిక స్థాయి విద్యావిధానంలో మౌలికపరమైన మార్పులు వచ్చే అవకాశం ఉందని విద్యావేత్తలు విశ్లేషిస్తున్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రస్తుత తరుణంలో అవసరమని ప్రశంసిస్తున్నారు.

నేడు జోనల్ స్థాయి సమావేశం

కడప నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి జోనల్‌స్థాయి సమీక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు హాజరుకానున్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ఉప విద్యాధికారులు డీఈఓలు, ఆర్జేడీ హాజరుకాను న్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి..



ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి. జీఓ 117 రద్దు చేస్తున్నందున పూర్వపు వ్యవస్థ పునరుద్ధరించి తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి. మూయని యూపీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలి. వారానికి పది పీరియడ్లు గణితానికి కేటాయించాలి. 3, 4, 5 తరగతులకు సబ్జెక్టు టీచర్లను కొనసాగించాలి. క్లస్టర్ మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటుచేయాలి.. తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టని పక్షంలో జీఓ 117 రద్దు వల్ల హైస్కూల్ టీచర్లకు అన్యాయం జరుగుతుంది.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి

వేలం ద్వారా రూ.19.88 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తంబళ్లపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి దేవస్థానానికి సంబంధించిన వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి నిర్వహించిన వేలం ద్వారా రూ.19,88,000లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. శుక్రవారం మల్లయ్యకొండ పైన ఆలయం వద్ద కూటమి నాయకులు, ఆలయ ఈవో, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఎస్ఐ లోకేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో హక్కులు పొందిన వారికి 2025 ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు హక్కులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, ఉత్తమ్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహన కార్యదర్శి సోముశేఖర్, ఆనందనాయుడు, సుధాకర్‌రెడ్డి, ఆదిరెడ్డి, మ్యూజికల్ శివ, మాజీ ఉపసర్పంచ్ మణి, మాజీ మల్లయ్యకొండ చైర్మన్ గంగులేరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, మదన్‌మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కొండకిట్ట, ఈశ్వర, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

- గుంతకల్లు డివిజన్ రైల్వే సలహా సభ్యుడు



సమస్యలపై స్టేషన్ మాస్టర్‌కు విన్నవిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రైల్వేస్టేషన్ మాస్టర్ రాజీవ్‌కుమార్‌కు గుంతకల్లు డివిజన్ రైల్వే సలహా సభ్యుడు తల్లం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో కరోనాతో నిలివేసిన రైళ్లు ఇక్కడ ఆగడం లేదని గుంతకల్లు రైల్వే డివిజన్ డీఆర్ఎంకు ఇప్పటికే వినతిపత్రం సమర్పించామని వివరించారు. రైల్వేస్టేషన్ ముందు భాగంలో ఆర్చి లేదని, దీంతో రైల్వేస్టేషన్‌ను ప్రయాణికులు గుర్తించడం కష్టంగా ఉందన్నారు. ప్రాంగణలో పిచ్చిమొక్కలు ఉన్నాయని, ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం ఉందన్నారు. రైల్వేస్టేషన్ ముందు భాగంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, రైలు దిగి ప్రయాణికులు వస్తున్న సమయంలో గంజాయి, మద్యం తాగిన వ్యక్తులు ఉంటారని దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. విన్నవించిన సమస్యలను ఉన్నతాధికారులకు పంపి పరిష్కారిస్తామని స్టేషన్‌మాస్టర్ సానుకూలంగా స్పందించారు.

దాడిలో గాయపడిన జనసైనికుడికి నాయకుల పరామర్శ



చికిత్స పొందుతున్న మునీర్

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రౌడీ మూకల దాడిలో గాయపడి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరుకు చెందిన జనసైనికుడు మునీర్(34)ను శుక్రవారం పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల జనసేన నాయకులు పరామర్శించారు. కందూరు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో మునీర్ గాయపడడంతో అతనిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పీలేరు జనసేన ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, పుంగనూరు జనసేన నాయకులు చిన్నా రాయల్, వేణుగోపాల్‌రెడ్డి అతనిని పరామర్శించారు. దాడి జరిగిన తీరు, దాడిలో పాల్గొన్నవారు, దాడి తరువాత జరిగిన పరిణామాలు అతన్ని అడిగి తెలుసుకున్నారు. అతనికి అందుతున్న వైద్యం గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇతరులపై భౌతిక దాడులకు పాల్పడడం హేయకరమన్నారు. మునీర్‌కు తమ పార్టీ అండగా ఉంటుందని, పార్టీ అధినాయకుల ఆదేశానుసారం చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి మునీర్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పీలేరు, పులిచెర్ల, పుంగనూరు, సోమల మండలాలకు చెందిన పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

శివుని కొండలకు ఉపాధి బాటలు

- రూ.4.30 కోట్లతో రోడ్ల నిర్మాణం
- ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి శ్రీకారం
- శివరాత్రికి పనులు పూర్తయ్యేలా చర్యలు

మదనపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలోని కొండలపై కొలువుదీరిన మల్లేశ్వరస్వామి ఆలయాలకు రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే భక్తుల సౌకర్యార్థం కొండలపై వెలసిన శివాలయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండకు, రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి, చెంబకూరులోని గట్టు వెంకటరమణస్వామి ఆలయాలకు భక్తులు వెళ్లేందుకు వీలుగా ఉపాధి హామీ పథకం కింద రూ.4.30 కోట్లతో తారురోడ్లు నిర్మిస్తున్నారు.

వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండకు రూ.1.45 కోట్ల వ్యయంతో తారురోడ్డు నిర్మిస్తున్నారు. మదనపల్లె నుంచి పది కి.మీ. దూరంలోని ఈ కొండపైకి వెళ్లాలంటే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపైకి వెళ్లడానికి రెండుమార్గాలు ఉండగా అందులో గుట్టకిందపల్లె నుంచి కొండమీదపల్లె తాండాకు ఇదివరకే రోడ్డు ఫార్మేషన్ చేసి వైసీపీ ప్రభుత్వంలో తారురోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి కూడా రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. అలాగే రెండోమార్గం మునగమాకులపల్లె నుంచి నాలుగు కిలోమీటర్లు కొండ ప్రాంతం. ఈ క్రమంలో మాజీ వీఆర్వో చిప్పిలి జగన్నాథరెడ్డి ఇదివరకే మొదటి మార్గంలోని గుట్టకిందపల్లె నుంచి గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనికి ఆహార పథకం, తర్వాత ఉపాధి హామీ పథకాలతోపాటు స్థానికుల సహకారంతో శ్రమదానంతో రోడ్డు ఫార్మేషన్ చేయించారు. అలాగే రెండో మార్గంలోనూ ఇదే తరహాలో మునగమాకులపల్లె మార్గంలోని కొండ కింద నుంచి 2.10 కి.మీ.కొండపైకి మట్టిరోడ్డు ఫార్మేషన్ చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం దీనిని తారురోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేస్తూ, క్రాసింగ్‌లను మరింత తగ్గిస్తూ, రాళ్లను పేల్చి రోడ్డు చదును చేస్తున్నారు. మూడు నెలలుగా ఈ పనులు ముమ్మరంగా జరుగు తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే కొండపైకి వాహనాలు వెళ్లే విధంగా పనులు పూర్తి చేశారు. దీంతో మదనపల్లె పట్టణంతో పాటు వేంపల్లె, అంకిశెట్టిపల్లె, కొత్తపల్లె, బొమ్మనచెరువు, కోటవారిపల్లె పంచాయతీలోని 40 గ్రామాల ప్రజలు కొండపైకి వెళ్లడానికి అవకాశం ఏర్పడటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెలలో జరగనున్న మహాశివరాత్రి వేడుకల నాటికి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.



మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపైకి పూర్తయిన రోడ్డు ఫార్మేషన్

గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి..

రామసముద్రం మండలంలోని చెంబకూరు మెయిన్‌రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలోని వైఎస్సార్ కాలనీకి సమీపంలోని గుట్టకింద వెలసిన గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి రూ.85 లక్షలతో తారు రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ మూడు ఆలయాలకు ఇప్పటికే రోడ్డు ఫార్మేషన్ పూర్తికాగా గట్టు వెంకటరమణస్వామి ఆలయం మార్గంలో కంకర పరిచే పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా నిధుల మంజూరుకు కృషి చేశారు. ఈ పనులను పంచాయతీరాజ్ డీఈ శివప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా భక్తుల సౌకర్యార్థం శివరాత్రి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి గ్రావెల్ రోడ్డు పూర్తయి తారురోడ్డుకు సిద్ధమైన కంకర పనులు

వాలీశ్వరస్వామి కొండపైకి..

రామసముద్రం మండలంలోని ప్రముఖ వాలీశ్వరస్వామి కొండపైకి కూడా ఇదే తరహాలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. రామసముద్రం మండలం నడింపల్లె నుంచి ఎనిమిది కిలోమీటర్లు దూరం ఉంది. ఇక్కడి నుంచి 4.80 కి.మీ. దూరం కొండమార్గం ఇది. ఏటా శివరాత్రి రోజున తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. కొండపైకి సరైన రోడ్డుమార్గం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ కూడా ఇదివరకే మాజీ వీఆర్వో జగన్నాథరెడ్డి కొండను తొలచి, రాళ్లను పేల్చి రోడ్డు ఫార్మేషన్ చేయించారు. ఇందులో సొంత నిధులతో పాటు దాతల సహకారంతో ఈ పనులు చేపట్టారు. అయినా పనులు పూర్తి కాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం వేంపల్లె మల్లయ్యకొండ తరహాలో ఇక్కడి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం రూ.7 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా, మొదటి విడతగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మూడు నెలలుగా ముమ్మరంగా పనులు చేపడుతున్నారు.



రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి కొండపైకి జరుగుతున్న రోడ్డు పనులు

సాగునీటి నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాల్వ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచి ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పంట కాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని, కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమ పంట పొలాలకు నికరసాగు జలాలు తీసుకురావడానికి అనేక ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. వ్యవసాయం కనీసంగా జీవించాలంటే సాగులోని 30 శాతం భూమికి కనీస సాగునీటి వనరులు కల్పించాలని, జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందని తెలిపారు. హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేలు, అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుత కాల్వ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేదని, వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని, 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగ సభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రకటించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాల్వ గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, శివరామకృష్ణ దేవర, సుమిత్రమ్మ, మనోహర్‌రెడ్డి, జ్యోతి, చిన్నయ్య, మురళీ, సుధీర్‌కుమార్, వెంకటేశ్, కోటేశ్వరరావు, సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

రవాణా వ్యవస్థ ప్రైవేటీకరణకు కేంద్రం యత్నం

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల ముసుగులో దేశంలోని ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఏపీపీటీడీ(ఆర్టీసీ)లోని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు ఆరోపించారు. పీలేరు డిపో కార్యాలయం ముందు వారు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రజా రవాణా వ్యవస్థల్లోకి విద్యుత్ బస్సుల నిర్వహణ ద్వారా ప్రైవేటు యాజమాన్యాలు, కార్పొరేట్ శక్తులను చొప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. 2029 నాటికి ప్రజారవాణా వ్యవస్థలోని 100 శాతం బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలంటూ నిర్ణయం తీసుకోవడం అందులో భాగమేనన్నారు. ఈ నిర్ణయం అమలైతే ఆర్టీసీ కూడా ప్రైవేటీకరణ కావడం తథ్యమని, ఆర్టీసీనే నమ్ముకున్న కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయానికి వ్యతిరేకంగా మార్చి 24న జరిగే 'చలో పార్లమెంటు' కార్యక్రమాన్ని ఆర్టీసీలోని కార్మికులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కేసీఎస్ రెడ్డి, హెచ్‌ఎం బాబు, ఎంసీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పీలేరు డిపో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి



జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధ, మేయర్ సురేశ్‌బాబు తదితరులు

కడప కలెక్టరేట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని కడప ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంపీ అధ్యక్షతన దిశా సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. కడప నగర మేయర్ సురేశ్‌బాబు, జడ్పీ చైర్‌పర్సన్ శారద, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా ఎంపీ మాట్లాడుతూ దిశా కమిటీ సమీక్ష సమావేశం జిల్లాలో మొదటిసారిగా నిర్వహించడం సంతోషకరమన్నారు. సుపరిపాలనతో ముందడుగు వేయడానికి దిశా కమిటీ కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వ 26 మంత్రిత్వ శాఖలకు సంబంధించిన 67 పథకాలలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని మానిటరింగ్ చేసి పరిష్కరించి ప్రజలకు చేరవేసేందుకు దిశా ఏర్పాటు జరిగిందన్నారు. కేంద్రం నుంచి జిల్లాకు రావాల్సిన నిధులు ఏ విధంగా తెప్పించాలనేది ఈ కమిటీ ద్వారా చర్చిస్తామన్నారు. అమృత్ పథకంలో భాగంగా కడప కార్పొరేషన్‌కు తాగునీరు అందించడానికి రూ.500 కోట్లతో తలపెట్టిన పనులను సత్వరమే ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్డీఏ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ, డ్వామా, గ్రామీణ నీటి పారుదల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల వారీగా జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమాలపై ఈ కమిటీలో సుదీర్ఘంగా చర్చించారు. కమిటీసభ్యులు లేవనెత్తిన పలు సమస్యలు, అంశాలను నమోదు చేసుకున్నామని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్, ఎంపీ పేర్కొన్నారు.

రెవెన్యూ..పోలీసుల రక్షణతో భూమి స్వాధీనం



వివాదాస్పద భూమిని లక్ష్మమ్మకు స్వాధీనం చేస్తున్న రెవెన్యూ, పోలీసులు

రామసముద్రం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కౌలుకు ఇస్తే భూమి తమదేనని తప్పుడు రికార్డులు సృష్టించి కబ్జా చేశారని బాధిత మహిళ లక్ష్మమ్మ సీఎంవోకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాలతో కబ్జాదారుల నుంచి భూమిని లక్ష్మమ్మ స్వాధీనం చేశారు. బాధిత మహిళ వివరాల మేరకు మండలంలోని నాగిగానిపల్లె పంచాయతీ ఎర్రనేలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ భర్త వెంకటరమణరాజుకు సర్వే నెంబర్218/1సీలో 2.75 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన సురేంద్రరాజుకు వెంకటరమణరాజు కౌలుకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వెంకటరమణరాజు మృతి చెందగా సురేంద్రరాజు కౌలు భూమికి సంబంధించి దొడ్డిదారిన పట్టా రూపొందించుకున్నాడు. ఈ విషయమై బాధిత మహిళ స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌కు పట్టించుకోలేదని లక్ష్మమ్మ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి బాధిత మహిళ లక్ష్మమ్మకు అప్పగించాలని తహసీల్దార్ నిర్మలాదేవికి గత ఏడాది నవంబర్ 20న ఆదేశాలిచ్చారు. ఇందుకు అనుగుణంగా రెవెన్యూ, పోలీసు సిబ్బందితో తహసీల్దార్ వివాదాస్పద భూమిని పరిశీలించి సర్వే చేసి కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుని బాధిత మహిళ లక్ష్మమ్మకు అప్పగించారు. అయితే భూమి కబ్జాదారులు అప్పటికే భూమిలో పంట సాగు చేయడంతో పంట నూర్పిడి కోసం కొంత సమయం ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం రెవెన్యూ, పోలీసు సిబ్బంది రక్షణలో లక్ష్మమ్మకు భూమిని స్వాధీనం చేశారు. అయితే ఈ భూమి గత 30 ఏళ్లుగా తమ అనుభవంలో ఉందని, దురుద్దేశంతో దౌర్జన్యంగా తమ భూమిని లాక్కున్నారని ఈ భూమి మాకు దక్కకపోతే మరణమే శరణ్యం అని మీడియాతో వాపోయారు.

హౌసింగ్ కుంభకోణంపై విచారణ చివరి దశకు

- వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి
- ప్రాథమిక విచారణలో రూ.38 కోట్లు గోల్‌మాల్
- పునర్విచారణలో రూ.44 లక్షలకు కుదింపు
- ముగ్గురు విశ్రాంత హౌసింగ్ ఇంజినీర్లపై చర్యలకు రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలికిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హౌసింగ్ కుభకోణంపై పదిహేనేళ్ల క్రితం ప్రారంభమైన విచారణ చివరి దశకు చేరుకుంది. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలు వెలువరించిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా ముగ్గురు ఉన్నత స్థాయి హౌసింగ్ ఇంజినీర్లు అక్రమాలు, అవినీతికి పాల్పడ్డట్లు విచారణలో తేలింది. చివరి దశ విచారణలో తేలిన అంశాలపై ఈ ముగ్గురి నుంచి పది రోజుల గడువుతో వివరణలు కోరుతూ ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసింది. అప్పట్లో ప్రొద్దుటూరు గృహనిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేసి నెల్లూరు ఈఈగా 2023 జూలై 31న పదవీ విరమణ చేసిన పి.నాగేశ్వరరావు, ప్రొద్దుటూరులో హౌసింగ్ ఈఈగా పనిచేసి 2022 ఏప్రిల్ 30 కడప హౌసింగ్ ఎస్ఈ/జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జిగా పదవీ విరమణ చేసిన ఎన్.రాజశేఖర్, ప్రొద్దుటూరు హౌసింగ్ డీఈఈగా పనిచేస్తూ 2023 మార్చి 31న రిటైర్డ్ అయిన ఆర్.వీరన్నలను జరిగిన అక్రమాలు, అవినీతికి ప్రభుత్వం బాధ్యులుగా తేల్చింది.

అమృతనగర్ ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు

ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. వైఎస్సార్ సీఎంగా వుండగా ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామం అమృతనగర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. సమీకృత గృహ నిర్మాణం మరియు మురికివాడల అభివృద్ధి పథకం కింద ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఈ కాలనీ గృహ నిర్మాణాల్లో అనేక అవకతవకలు, అవినీతి జరిగిందని అప్పట్లో ఆంధ్రజ్యోతి సమగ్ర కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టరు వెంటనే విచారణకు ఆదేశించారు. అప్పటి కడప, కర్నూలు జిల్లాల ప్రత్యేక అధికారి సమగ్రంగా విచారణ చేయడానికి పలు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేయించారు. మొత్తం రూ.38 కోట్ల, 97 లక్షల, 23 వేల, 455లు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఈ మొత్తం అక్రమాలకు, అవినీతికి నిర్మాణాలను పర్యవేక్షించిన ఇంజినీర్లనే బాధ్యులుగా నిర్ధారించారు. దీనిపై తదుపరి చర్యల కోసం ఇంజినీర్లకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసి సంజాయిషీలు కోరింది. అయితే కడప, కర్నూలు ప్రత్యేక అధికారి నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా విచారణ జరపలేదని, సాంకేతిక నిపుణులైన అధికారుల చేత తిరిగి విచారణ చేయించాలని ఇంజినీర్లు ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై పునర్విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి హౌసింగ్ సూపరింటెండెంట్ ఇంజినీరు కె.వెంకట నారాయణతో విచారణ జరిపించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే విచారణకు అవసరమైన పత్రాల్లో చాలా భాగం అందుబాటులో లేకపోవడంతో ఉన్నంతలో క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించి నివేదిక అందజేశారు. మొత్తం మీద ఇంజినీర్లు ఉమ్మడిగా రూ.43,63,550ల అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారని విచారణాధికారి ధ్రువీకరించారు. ఇంజినీర్లు విడివిడిగా రూ.10 లక్షలు దుర్వినియోగం చేసినట్లుగా కూడా విచారణలో తేలింది.

అక్రమాలు జరిగిన వివరాలు

గృహ నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులు ఉమ్మడిగా రూ.43,63,550లు దుర్వినియోగానికి బాధ్యులుగా పునర్విచారణలో నిర్ధారణ అయింది. ఇందులో రెండిళ్లను కలిపి నిర్మించడంలో రూ.63,000, నిర్మాణ స్థాయిల వ్యత్యాసాల్లో రూ.77,500, రెండుసార్లు చెల్లింపుల ద్వారా (డబుల్ పేమెంట్) రూ.13,84,450, ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగం ద్వారా రూ.11,93,600, అడ్మినిస్ట్రేటివ్ ఫీజుల (ఏడీఎఫ్) దుర్వినియోగం రూ.16,45,000లు మొత్తం రూ.43,63,550లు అవినీతి జరిగిందని ప్రభుత్వం వివరించింది. అంతేగాకుండా అప్పటి డీఈఈ ఆర్.వీరన్న ఏడీఎఫ్ నిధుల్లో రూ.7,75,000లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎన్.రాజశేఖర్ రెండేసి మార్లు చెల్లింపుల ద్వారా రూ.2,38,200, ఏడీఎఫ్ నిదుల్లో రూ.5000లు వంతున అక్రమాలకు పాల్పడ్డట్లు తేల్చారు. మొత్తం మీద ఇంజినీర్లు లబ్ధిదారులతో కుమ్మక్కై అనేక అక్రమాలకు పాల్పడిన వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన దరిమిలా ఈ విచారణలు చేపట్టినట్లు ప్రభుత్వం విడుదల చేసిన జీవోల్లో ప్రస్తావించింది. కాగా మొదటి విచారణలో తేలిన దుర్వినియోగం సొమ్ము మొత్తం రూ.38 కోట్ల 97 లక్షల 23 వేల 455లకు సంబంధించిన రికార్డులేవీ అందుబాటులో లేనందున దాన్ని వదిలేసి తాజాగా పునర్విచారణలో నిర్ధారణయిన రూ.43,63,550ల వరకే చర్యలుంటాయా అన్న విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. కాగా పునర్విచారణకు సంబంధించిన దుర్వినియోగమైన నిధులకు సంబంధించి పది రోజుల్లోగా సంజాయిషీలు పంపుకోవాలని ముగ్గురు ఇంజినీర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఆ తరువాత తగు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఐదు వేర్వేరు జీవోలు జారీ చేశారు.

ఫిబ్రవరి 1 నుంచి భూముల ధరల పెంపు



కడప రిజిస్ట్రార్ కార్యాలయం

- కసరత్తు పూర్తి చేసిన జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు
- జాతీయ రహదారులు, రింగ్ రోడ్లకు ఇరుపక్కల భూముల ధరల పెంపుపై దృష్టి
- గతంలో అధికంగా ఉన్న మార్కెట్ వాల్యూ సవరణలు

కడప కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారులో స్పెష ల్ రివిజన్ పేరుతో రెండు దఫాలు పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు పెంచి డబుల్ ధమకాగా స్థిరాస్థిదారుల గెండెల్లో గుబేలుమనిపించారు. పట్టణ ప్రాంతాల వారీగా భూముల ధరలను లెక్కించకుండా ఇబ్బడి ముబ్బడిగా పెంపు చేశారు. అప్పట్లో ప్రజల్లో వ్యతిరేకత వచ్చినా.. రిజిస్ట్రేషన్ అధికారులు కూడా జీ హుజూరు అంటూ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారనే విమర్శలు ఉన్నాయి. వారు చెప్పిన ప్రాంతాల్లో భూముల విలువలు పెంచారే తప్ప కమర్షియల్‌గా పెంచాల్సిన ప్రాంతాలను గాలికొదిలి ఖజానా శాఖ రాబడికి గండి కొట్టారనే ఆరోపణలు లేకపోలేదు. దీనిపై కూటమి సర్కార్‌కు ఫిర్యాదుల నేపథ్యంలో సవరణలు చేసేందుకు సిద్ధమైంది. గత 3 నెలలుగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, రిజిస్రేషన్ శాఖ డీఐసీ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబుతో పాటు ఆర్డీవోలు, రెవెన్యూ యంత్రాంగం తీవ్ర కసరత్తు చేపట్టారు. స్వయంగా భూముల ధరల పెంచే ప్రాంతాలను పరిశీలించడంతో పాటు మార్కెట్ వాల్యూ పెంపు ఏ మేరకు పెంచాలి.. గత ప్రభుత్వ హయాంలో పెంచిన ధరలు అధికంగా ఉన్నాయా.. అనే విషయాలను బేరీజు వేసుకుంటూ భూముల ధరల పెంపునకు అడుగులు వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రాంతాల వారీగా లెక్క గట్టి భూముల ధరల పెంపుపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు జాయింట్ కలెక్టర్ కమిటీకి నివేదిక సమర్పించారు. జేసీ కమిటీ తప్పొప్పులతో పాటు అధికంగా ధరలు ఉంటే సవరణలు చేసి పూర్తి వివరాలతో ప్రభుత్వానికి పంపనున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి అనగాని ప్రసాద్ ప్రకటన నేపథ్యంలో గతంలో స్పెషల్ రివిజన్‌లో అధిక పెంపును సవరిస్తూ స్థిరాస్థిదారులకు భారం కాని విధంగా 10-20శాతం మేర భూముల ధరలు పెంచి ఫిబ్రవరి 1 నాటికి, పెంచిన ధరలతో రిజిస్ట్రేషన్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

జాతీయ రహదారులకు ఇరువైపుల భూముల ధరల పెంపు

ఇన్నాళ్లుగా భూముల మార్కెట్ ధరలు కేవలం పట్టణ ప్రాంతాలు, కమర్షియల్‌గా రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు జరిగే ప్రాంతాలలో మాత్రమే భూములు, స్థలాల ధరలు పెంపు జరుగుతోంది. అది కూడా ప్రతి ఏటా జనవరి, మార్చి నెలల్లో ధరలు పెంచడం రిజిస్ట్రేషన్ శాఖకు ఆనవాయితీ. కానీ ఈ దఫా గత ప్రభుత్వ హయాంలో అధిక పెంపును సవరిస్తూ, జాతీయ రహదారులు, రింగ్ రోడ్లకు ఇరువైపుల భూముల విషయంలో ధరల పెంచేందుకు జిల్లాలో పెద్ద కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఎందుకంటే భూ సేకరణ సమయంలో నష్టపరిహారం చెల్లింపులు, కోర్టు కేసులు లాంటి సమస్యల కారణంగా ఈ భూముల ధరల పెంచితే తిప్ప లు తప్పవని అధికారులకు వెనకడుగులు పడేవి. ముఖ్యంగా ఈ జాతీయ రహదారులకు ఇరువైపుల భూముల్లో అనధికారికంగా కమర్షియల్‌గా కోట్ల రూపాయిలతో నిర్మాణాలు సాగుతున్నాయి. భూముల ధరలు మాత్రం ఎకరానికి రూ.10లక్షల నుంచి 20 లక్షలకు మించేది కాదు. జాతీయ రహదారులు, రింగ్ రోడ్లకు ఇరువైపుల ఇదే భూములను కమర్షియల్‌గా లెక్కిస్తే బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర అక్షరాలు రూ.5 కోట్ల నుంచి 10 కోట్ల పైమాటే. ఇలాంటి అంశాలపై ఇన్నాళ్లు దృష్టి పెట్టని కారణంగా రిజిస్ట్రేషన్ శాఖ రాబడికి పెద్ద ఎత్తున గండి తప్పలేదంటారు.

కడప నగర పరిధిలోని కడప- మద్రాసు రోడ్డు, రామాం జనేయపురం సర్కిల్ నుంచి ఉక్కాయపల్లి మీదుగా ఆలంఖాన్‌పల్లి, ఇర్కాన్ సర్కిల్, అక్కడ నుంచి రాయచోటి వెళ్లే మార్గాలు, పులివెందుల రోడ్డుకు ఇరువైపులా భూముల మార్కెట్ ధరలపై రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారులు ఉండే ప్రాంతాల్లో ఎకరం ధర రూ.10-20 లక్షలకు మించని కారణంగా ఆ ప్రాంత రైతుల్లో అసంతృప్తి ఉంది. రైతులకు తమ వ్యక్తిగత అవసరాల కోసం బ్యాంకుల్లో అధిక మొత్తంలో రుణా లు దక్కని పరిస్థితి. తమ భూములు కమర్షియల్‌గా అమ్ముకోలేక పోయినప్పటికీ భూమి ధరలు పెంచడం వల్ల తమ పిల్లల పెళ్లిళ్లకు, చదువులు, ఇతర ఆర్థిక అవసరాలకు బ్యాంకుల్లో అధిక మొత్తంలో రుణాలు పొందే వీలుందని ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలకులకు, అధికారులకు రైతులు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి భూములకు బహిరంగ మార్కెట్ ధరలను పరిగణలోకి తీసుకొని ఒక మోస్తారులో పెంచడం ఖాయంగా కనిపిస్తోంది.

జగన్ సర్కారులో రెండుసార్లు స్పెషల్ రివిజన్

ప్రతి ఏడాది జనవరి, మార్చి మాసాల్లో భూములు, ఇళ్ల స్థలాల ధరల పెంపు ఉంటుంది. కానీ జగన్ సర్కారులో ఐదేళ్ల పాటు మార్కెట్ వ్యాల్యూ పెంచలేదు. కానీ సడిసప్పిడి కాకుండా స్పెషల్ రివిజన్, యూజర్ చార్జీల మోత మోగించారు. దీంతో స్థిరాస్థిదారులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటే తడిసి మోపెడు అయ్యేది. ఇకపోతే రిజిస్ట్రేషన్ కార్యాలయాల వారీగా 10-20 శాతం మేర భూముల ధరలు పెంచి స్టాంపు రుసుం కింద ఏటా కోట్ల రూపాయిలు టార్గెట్ విధించేది. కానీ జగన్ సర్కారులో ఐదేళ్ల పాటు భూముల ధరలు పెంచకుండానే స్పెషల్ రివిజన్ సాకుతో డబుల్ రాబడి రాబట్టడంలో దిట్టలని చెప్పవచ్చు. 2023లో కడప రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఏడాదికి రూ.54 కోట్ల రాబడి టార్గెట్ ఉండేది. స్పెషల్ రివిజన్‌లో ఏకంగా రూ.84 కోట్లు టార్గెట్ విధించడం ఇందుకు తార్కాణం. స్థిరాస్థిదారులకు ఒక భద్రతగా స్టాంపుల వ్యవస్థ ఉండేది. దానిని కూడా రద్దు చేసి ఈ-స్టాంపు విధానం తేవడంతో పెద్ద విమర్శలు ఎదుర్కోక తప్పలేదు. ఇకపోతే యూజర్ చార్జీలు రూ.200 నుంచి రూ.500లకు, ఈసీ కావాలంటే రూ.20ల నుంచి రూ.100లకు పెంచారు. స్టాంపులకు చలానా ఉండేది కాదు. ఇపుడు రూ.50లు చెల్లించే పరిస్థితి వచ్చిందంటే జగన్ సర్కారులో గుట్టుచప్పుడు కాకుండా స్థిరాస్థి రిజిస్ట్రేషన్లపై ప్రజలపై మోత మోగించింది. ఇలాంటి అంశాలను ఈ దఫా సర్కారు సవరణలు, సర్దుబాటులు చేసే దిశగా పావులు కదుపుతోంది.

ఎల్‌పీ నెంబర్లతో రిజిస్ట్రేషన్ల రాబడికి

జగనన్న భూరక్ష పేరుతో భూముల రీసర్వే తప్పులు తడకగా సాగింది. రైతులకు సంబంధించిన భూములకు సర్వే నెంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సల్ (ఎల్‌పీ) నెంబర్లు కేటయించారు. అయితే ఆ భూమిని రైతు తన ఇబ్బందుల రీత్యా కొంత అమ్ముకుంటే.. ఆ భూమిని కొన్న వ్యక్తులకు భవిష్యత్తులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల కష్టాలు తప్పడం లేదు. దీంతో రీసర్వేలో అనాలోచిత నిర్ణయాలతో ఎల్‌పీ నెంబర్లు కేటాయించిన జిల్లాలో 200కు పైగా గ్రామాల్లో స్థిరాస్థిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. కళ్లెదుటే లక్షలు, కోట్ల విలువలు చేసే భూములు ఉన్నా తమ ఆర్థిక ఇబ్బందులకు అమ్ముకోలేని పరిస్థితి. దీంతో రెవెన్యూలో కూడా ఎల్‌పీ నెంబర్లకు బై నెంబర్లు జోడించడంతో రిజిస్ట్రేషన్లు జరగని కారణంగా పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ల శాఖ రాబడికి గండి పడింది. ఇలాంటి పరిస్థితి జగన్ సర్కారులో రీసర్వే జరిగిన 285 గ్రామాల్లోని 4.44 లక్షల ఎకరాల రైతులకు తప్పలేదు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్లు, రిజిస్ట్రేషన్ అధికారులు తప్పొప్పుల సవరణలకు ముందుకు రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రెవెన్యూ సదస్సులో ఎల్‌పీ నెంబర్ల విధానం సవరణలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. అందులో ఉన్న తప్పొప్పులను సరిదిద్దితే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగేందుకు వీలుందంటారు.

పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరశుభ్రతతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తారాకరామనగర్‌లో జరుగుతున్న డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ అకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువల్లో చెత్తా చెదారం వేయవద్దన్నారు, వారానికి ఒకసారి ఇళ్లలోని నీటి తొట్లు, కుండలు, బాన లు ఇతర పాత్రలను శుభ్రం చేసి కొంత సేపు ఎండలో ఉంచాలన్నారు. దోమ ల నియంత్రణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. లేకపోతే దోమ కాటుకు విషజ్వరాలు మలేరియా, డెంగ్యూ సోకే ప్రమాదం ఉందన్నారు. రాత్రి వేళల్లో దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలన్నారు. మెడిక్ ఆఫీ స రు సుభానీ, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ మలేరియా అధికారి నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మీదేవి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేలంను అడ్డుకున్న మారుతీ మహాలక్షుమ్మ



వేలం నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడుతున్న మారుతీ మహాలక్షుమ్మ

బ్రహ్మంగారిమఠం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో కొబ్బరిముక్కలు వసూలు చేసే హక్కుకు సంబంధించి శుక్రవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ నేతృత్వంలో వేలం నిర్వహించారు. ఈవిషయం తెలుసుకున్న దివంగత మఠాధిపతి వసంత వేంకటే శ్వరస్వామి సతీమణి మారుతీ మహాలక్షుమ్మ పాట మధ్యలో అడ్డుకున్నారు. దేవస్థానంలో వేలం నిర్వహించడానికి ఫిట్‌పర్సన్‌కు అర్హత లేదన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా వేలంపాట కార్యక్రమాన్ని చేపడతారని అక్కడున్న అధికారులను ప్రశ్నించారు. ఉదయం 10గంటలకు వేలం ప్రారం భం కాగా.. మొదటి కొబ్బరిముక్కలు వసూలు చేసే హక్కుకు వేలం నిర్వహించారు. పాటదారుడు రూ.14లక్షలకు పాట పాడి దక్కించుకున్నాడు. అనంతరం పోలేరమ్మ గుడి ఆవరణలో కొబ్బరికాయలు అమ్ముకునేందుకు వేలం నిర్వహిస్తున్న సందర్భంలో మారుతీ మహాలక్షుమ్మ మధ్యలో వచ్చి పాటను రద్దు చేయాలని అధికారులను కోరారు. దీంతో చేసేది లేక అధికారులు వేలం రద్దు చేసి వెళ్లిపోయారు.

వాహనం ఢీ.. వ్యక్తి మృతి



ఎర్రగుంట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమకూరులో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. చిలమకూరు నాలుగురోడ్ల కూడలిలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. చిలమకూ రులో కొంతకాలంగా భిక్షాటన చేస్తూ తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మృతి చెందిన వ్యక్తి పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలంలోని ముద్దిరెడ్డిపల్లె సమీపంలో ట్రాక్టర్ ఢీ కొనడంతో తంగెళ్ల జానీ(40) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. తిప్పిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన జానీ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవిస్తుండేవారు. శుక్రవారం సాయంత్రం పని పెంట నుంచి ఇంటికి బైక్‌పై వెళుతుండగా చెత్త లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వాచ్‌మేన్‌పై దాడి.. తీవ్ర గాయాలు



కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలో ఓ హోటల్‌లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న రామక్రిష్ణను ఓ యువకుడు చాకుతో పొడిచాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. నాగరాజుపేటకు చెందిన రామక్రిష్ణ హోటల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఓ యువకుడు అక్కడికి వచ్చి అతనితో గొడవ పడి తన వద్ద ఉన్న చాకుతో పొడిచి పారిపోయాడు. దీంతో రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా డు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులకు గాయపడ్డ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

యువతి అదృశ్యం

కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం బహుజననగర్‌కు చెందిన యువతి గురువారం అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. కడప బహుజననగర్‌కు చెందిన షేక్ రేష్మా గురువారం ఇంటి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, ఆచూకీ తెలిసిన వారు 9121100524కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సఖ్యతగా ముందుకు సాగుతాం...

కేంద్ర పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి



బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న సింగారెడ్డి

కడప మారుతీనగర్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా కొనసాగుతూనే మిత్రపక్ష పార్టీలైన తెలుగుదేశం, జనసేన నాయకులతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సఖ్యతగా ముందుకుసాగుతామని కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఇటీవల పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జె.వెంకట సుబ్బారెడ్డిని సింగారెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ఇబ్బందులను పాలక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా రాయలసీమలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, రోడ్ల సమస్యలు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు వెనుకాడబోమన్నారు. ఇప్పటికే పార్టీలో యువత అధికశాతం సభ్యత్వం స్వీకరించారని, సీనియర్ నాయకుల సలహా, సూచనలతో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, కళ్యాణ్, లక్ష్మణరావు, మహిళానాయకురాలు పద్మావతిబాయి తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి కారుణ్య నియామక ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న జడ్పీ సీఈవో, చైర్మన్

కడప రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజాపరిషత్ శాఖలో నలుగురికి కారుణ్య నియామక ఉద్యోగాలు కల్పించినట్లు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన ఉద్యోగులకు ఆయా మండలాల్లో పోస్టింగ్‌లు కల్పించామన్నారు. ఇందులో పి.మనోహర్‌ను పెగలూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో, పి.నాగలక్ష్మిని వల్లూరులోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో, సి.అంకాలయ్యను కొండాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో, డి.వెంకట పృధ్వీరాజ్ ఆర్యన్‌ను పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్‌గా నియమించామని తెలిపారు. ఉద్యోగాలలో చేరిన వారు బాధ్యతగా విధులను నిర్వర్తించాలని తెలిపారు. వీరికి నియామక పత్రాలను చైర్మన్ జె.శారదతో కలిసి అందించామన్నారు.

లారీలో మంటలు



సికెదిన్నె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో లారీలో అగ్నిప్రమాదం సంభవించింది. కడప-రాయచోటి జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం గువ్వలచెరువు ఘాట్ మూడో మలుపు వద్ద లారీలో హీట్ అయిన కారణంగా క్యాబిన్‌లో మంటలు సంభవించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే డ్రైవర్ క్యాబిన్, ముందు టైర్లు కాలిపోయాయి. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదని తెలిసింది.

అన్నదాన సత్రం సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

ఖాజీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగనాథేశ్వర కొండ కింది భాగంలోని అన్నదాన సత్రంను సీజ్ చేసినట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, తహసీల్దారు మహబూబ్‌బాష తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి చైర్మన్ ఎటువంటి అనుమతులు లేకుండా కొండ కింది భాగంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేశా రు. ప్రస్తుతం అన్నదాన సత్రంలో పలు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు భక్తుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు రావడంతో ఆమేరకు పరిశీలించి సీజ్ చేశామని తెలి పారు. పవిత్రమైన కొండ కింది భాగంలో అపవిత్రతకు పాల్పడితే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పదస్థితిలో సచివాలయ ఉద్యోగి మృతి



గణేశ్ మృతదేహం

పులివెందుల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని కనంపల్లె గ్రామానికి చెందిన కాటమదేవ గణేశ్ (27) అనే సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో చెందాడు. వివరాలిలా.. కనంపల్లెకు చెందిన కాటమదేవ గంగరాజు ఏకైక సంతానమైన గణేశ్ తొండూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన రైతు సేవా కేంద్రంలో పశు సంవర్ధక సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి భార్య కవితతో పాటు నాలుగు సంవత్సరాల కుమార్తె కూడా ఉంది. ప్రతిరోజూ లాగే శుక్రవారం విధులకు హాజరై తిరిగి ఇంటికి వచ్చి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. అయితే గణేశ్ ఆత్మహత్యకు గల కార ణాలు తెలియాల్సి ఉంది. అర్బన్ ఎస్ఐ నారాయణ సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. గణేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటి కాల్వలో వృద్ధుడు..



పక్కీరప్ప (ఫైల్)

పులివెందుల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నీటి కాల్వ లో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని నల్లపురెడ్డిపల్లెకు వెళ్లే దారిలో ఉన్న కాల్వలో మృత దేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. దర్గావీధికి చెందిన పక్కీరప్ప (78) అనే వృద్ధుడి మృత దేహం కాల్వ వద్ద పడి ఉంది. అటుగా వెళ్లిన స్థానికులు ఈ విషయాన్ని పలువురికి తెలియజేయడంతో కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో వారు ఘటనా ప్రదేశానికి చేరుకుని ఫక్కీరప్పను గుర్తుపట్టారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. లింగాల మండలం మురారిచింతల గ్రామం సొంత ఊరు కాగా.. శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో లింగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా వృద్ధుడు మృతి చెందిన ప్రదేశంలో నీరు పెద్దగా లేకపోవడం, ఇక్కడ బట్టలు శుభ్రం చేసే వారు, గేదెలను మేపుకునేవారు నిత్యం సంచరిస్తూ ఉంటారని... ఈ నేపథ్యంలో వృద్ధుడు మృతి పలు అనుమానాలకు తావిస్తోంది.

వ్యక్తిపై కత్తులతో దాడి



కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న వైన్‌షాపులో శుక్రవారం సాయంత్రం మద్యం తాగుతున్న వ్యక్తిపై కత్తి, గొడ్డలితో కొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడి వివరాల మేరకు.. కడప మాసాపేటకు చెందిన వెంగళరాజా యార్డులో హమాలీగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లి మందు తీసుకుని పక్కనున్న రూములో తాగుతుండగా మాసాపేటకు చెందిన కొందరు యువకులు అక్కడికి చేరుకుని అతనితో ఘర్షణ పడి గొడ్డలి, కత్తులతో తలపై దాడి చేశారు. రక్తస్రావం ఎక్కువ కావడంతో అక్కడున్న వారు రిమ్స్‌కు తరలించారు. మాసాపేటకు చెందిన ప్రసన్న, సాయిలు తనపై కక్ష పెంచుకుని మరికొందరితో కలిసి వచ్చి తనపై దాడికి పాల్పడ్డారంటూ రిమ్స్ అవుట్ పోస్టు లో ఫిర్యాదు చేశాడు. టూటౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఈ సంఘటనపై విచారిస్తున్నారు.

ప్రజాసహకారంతో బాల్య వివాహాల కట్టడి

బాల్య వివాహలపై అవగాహన అవసరం ● జాతీయ బాలికల దినోత్సవంలో సీడీపీఓ సౌభాగ్యమ్మ ● నినాదాలతో హోరెత్తిన విద్యార్థుల ర్యాలీ

రైల్వేకోడూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో బాల్య వివాహాలను అరికట్టగలమని, ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రైల్వేకోడూరు ఐసీడీఎస్ సీడీపీఓ సౌభాగ్యమ్మ అన్నారు. శుక్రవారం హెచ్ఎంఎం హైస్కూలులో జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్ట రిత్యా నేరమన్నారు. ఆడ పిల్లలకు 18 ఏళ్ల తర్వాతే వివాహాలు చేయాలన్నారు. హైస్కూలు కరస్పాండెంట్ దేవసుందరం మాట్లాడుతూ ఆడ పిల్లలు సాంకేతికంగా, స్వయం ప్రతిపత్తితో ముందుకుపోవాలన్నారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ 112, 1098 ఫ్రీ నెంబర్లు గురించి పిల్లలకు వివరించారు. ఏసీడీపీఓ సరళాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే వాటిని కట్టడి చేయాలంటే ప్రజలు సహకరించాలన్నారు. సాంఘిక దురాచాలపై నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రవల్లిక, సుబ్బలక్ష్మీ, యశోద, వెంకటరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ విద్యార్థినుల ర్యాలీ

సిద్దవటం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులతో పురవీధుల్లో అంగన్వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, హెచ్ఎం శ్రీరాములు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వైబీఎన్‌పల్లెలో ర్యాలీ...

రాజంపేట టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్నిరంగాల్లో పైచేయి సాధించి భవిష్యత్ ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య సూచించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వైబీఎన్‌పల్లెలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేట జడ్పీ హైస్కూల్‌లో...

పుల్లంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు, మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భారతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల నివారణ ప్రతిజ్ఞ చేసి మానవహారం చేపట్టారు.

లక్కిరెడ్డిపల్లెలో...

లక్కిరెడ్డిపల్లె,జనవరి 24(ఆంధ్రజ్యోతి); బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దాదాబీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హెచ్ఎం రమణమ్మ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేకోడూరు విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న సీడీపీఓ సౌభాగ్యమ్మ

ఓబులవారిపల్లెలో...

ఓబులవారిపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్లో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో బాలికలు నడుచుకోవాల్సిన విధి విధానాలను, పౌష్టికాహారం వంటి విషయాలను వివరించారు. ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఎస్ఐ మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రామాపురం, జనవరి24(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని డీసీపీఓ వినోద్‌కుమార్, పద్మావతి అన్నారు. ఆదర్శ గువ్వలచెరువు ఉర్దూపాఠశాలలో బాలికల దినోత్సవం నిర్వహించారు. బాల్యవివాహాలతో జరిగే అనర్థాలు, విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ విద్య ఆరోగ్యం పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి తెలిపారు.

అభివృద్ధి కోసమే మంత్రి శ్రమిస్తున్నారు

టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి


రాయచోటిటౌన్, జనవరి24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసమే మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కృషి చేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చౌకబారు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి ఆయన చేసిన అభివృద్ధి కన్నా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో ఈ ఐదేళ్లలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. నియోజకవర్గంలో తాగునీటి బోర్లు, మోటార్లు, పైపులైన్లు వేయిస్తున్నామన్నారు. వెలిగల్లు, నాగిరెడ్డి రిజర్వాయర్లకు ఎత్తిపోతలతో నీటిని నింపుతామన్నారు. ఈ ఐదేళ్లలో ప్రతి చెరువునూ సాగునీటితో నింపి ప్రతి ఎకరాను సస్యశ్యామలం చేస్తామన్నారు. పట్టణంలో అధునాతన పార్కు కోసం రూ.3 కోట్లతో పనులు చేపట్టబోతున్నామన్నారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో మైనార్టీల కోసం షాదీఖానాకు రూ.2.5 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. నియోకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.29.812 కోట్లు నిధులు మంజూరు చేసి పూర్తికావచ్చాయన్నారు. తాగునీటి అవసరాల కోసం రూ.12 కోట్ల నిధులతో నూతన బోర్లు, మోటార్లు, పైపులైన్లు పనులు కొనసాగుతున్నాయన్నాయన్నారు. మాజీ జడ్పీటీసీ నరసారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్లు గాజుల ఖాదర్‌బాషా, చెన్నూరు అన్వర్‌బాషా, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచులు నాగేశ్వర్‌నాయుడు, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు శివప్రసాద్‌రెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, టీడీపీ నేతలు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మదన్‌మోహన్, చిన్నరెడ్డెయ్య యాదవ్, జాఫర్‌అలీ, విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల బాషా తదితరులు పాల్గొన్నారు

గృహ నిర్మాణాల్లో 2.0పై సమీక్ష

గాలివీడు, జనవరి24(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణశాఖలో సొంతింటి సాకారం కోసం పీఎం ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన 2.0 వర్షన్‌కు విశేష స్పందన లభిస్తోంది. నిరుపేదలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గృహాలు పొందేందుకు ప్రభుత్వం చర్యలు సులభతరం చేసిందని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ రమేశ్‌నాయక్, ఉపాధి హామీ ఏపీఓలు, సచివాలయాల సిబ్బందితో జరిగిన సమీక్షలో పేదవాడి సొంతింటి కల నిజం చేయడానికి పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్ కొత్త విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టారు. అర్హత కలిగిన లబ్దిదారులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయోజనం పొందవచ్చన్నారు. పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్ కింద ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖలో 2.0 వెర్షన్ ప్రవేశ పెట్టిందని, సచివాలయంలోని ఇంజనీర్ అసిస్టెంట్ల సహకారంలో ఈపాటికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల నుంచి సుమారు 2500పైగా దరఖాస్తులు వచ్చాయని వీరంతా ఆయా సచివాలయాకు వెళ్లి ఆదాయ, కుల, ఇంటి నివాస స్థలం సర్టిఫికెట్లుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

లేని కులాలకు షాపుల కేటాయింపు దారుణం

కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వెంకటనరసయ్య



మాట్లాడుతున్న వెంకటనరసయ్య

రాజంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా లేని కులాలకు మద్యం షాపులను కేటాయించడం దారుణమని వెంటనే వీటిని రద్దు చేయాలని ఒంటిమిట్ట టీడీపీ నేత, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంటిమిట్టలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గీత కుల కార్మికులకు రాష్ట్రంలో 335 మద్యం షాపులను కేటాయించగా అందులో కడప జిల్లాకు 14 కేటాయించారన్నారు. అయితే జిల్లాలో గౌడ, గౌండ్ల కులాలకు 6 షాపులను ఎక్సైజ్‌శాఖ అధికారులు కేటాయించారన్నారు. ఇందులో ఈడిగ కుల నేతల డిమాండ్లను పరిగణలోకి తీసుకోలేదన్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్, పులివెందుల, ప్రొద్దుటూరు మైదుకూరులలో గౌడ్స్‌కు మద్యం షాపులను కేటాయించారన్నారు. ఖాజీపేటను గౌండ్లకు, వల్లూరు గౌడకు కేటాయించారన్నారు. బద్వేలు, ప్రొద్దుటూరు రూరల్, వీరబల్లె, పెద్దముడియం, చింతకొమ్మదిన్నె, చక్రాయపేట, కాశినాయన, వేముల మండలాలను ఈడిగలకు కేటాయించారన్నారు. జిల్లాలో అసలే లేని గౌడ, గౌండ్లకు 6 షాపులను ఏకపక్షంగా కేటాయించారని ఆరోపించారు. వెంటనే ఈ షాపులను రద్దు చేసి వాటిని కూడా ఈడిగలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు విజ్ఞాపన పత్రం పంపామన్నారు.

పిచ్చికుక్కల దాడిపై అవగాహన అవసరం

రామాపురం, జనవరి24(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్కలు పశువులపై దాడి చేస్తే ఆ గాయాన్ని వెంటనే సబ్బుతో శుభ్రంగా కడగాలని, ఆస్పత్రిలో ర్యాబిస్ ఇంజక్షన్ వేయించాలని ప్రయాణిక విభాగం పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు సూచించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా చిట్లూరు పంచాయతీ మజ్జిగవాండ్లపల్లెలో ఆయన మాట్లాడుతూ పిచ్చికుక్క పశువులు, మేకలు, గొర్రెలపై దాడి చేసిన రోజు మూ డోరోజు, ఏడు, 14, 28వ రోజు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. అనంతరం పశు వైద్యశాలను సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై, ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, సహాయ సంచాలకులు సుధీర్‌నాథ్, బెనర్జీ మండల పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పశుసం వర్థకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి

రాజంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పనిసరి వేయాలని పశు వైద్య సహాయక సంచాలకులు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. ఆకేపాడు పంచాయతీ కట్టకిందపల్లె, పెద్దూరు, ఆచాన్‌పల్లె, రామిరెడ్డిగారిపల్లె, కొండ్లోపల్లె, ఊటుకూరు, గాలివారిపల్లె, భువనగిరిపల్లెల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. అత్తిరాల పశువైద్యాధికారి డాక్టర్ కె.భాగ్యవతి ఆధ్వర్యంలో నట్టల నివారణ మందు అందించారు. ఎం.వరదయ్య, జేవీఓ ప్రియాంక, ఏహెచ్ఏ రాజేంద్ర, ఏహెచ్ఏ పవన్‌కల్యాణ్, ఏహెచ్‌హెచ్ గంగరాజు, ఏహెచ్ఏ సుదర్శన్‌రెడ్డి, ఏవీ వెంకటసుబ్బయ్య, ఎల్ఎస్ఏ ఆనంద్‌బాబు, వీఏల్వో పాల్గొన్నారు.

బాకరాపేటలో ఆరోగ్యశిబిరాలు

సిద్దవటం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాకరాపేటలో పశు ఆరోగ్యశిబిరాలు నిర్వహించారు. పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. వెటర్నరీ డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ పశు వ్యాధుల పట్ల అప్రమత్తత తప్పనిసరన్నారు. దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ ప్రధాన మన్నారు. ఆరోగ్య శిబిరాలు 30వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. వెటర్నరీ వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

రాజంపేట క్రీడామైదానం చదును

రాజంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, వెంకటయ్యనాయుడు ఆధ్వర్యంలో రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానాన్ని చదును చేయించారు. డోజర్‌తో మైదానంలో ఉన్న పిచ్చిమొక్కలను, ముళ్లచెట్లను తొలగించారు. సుమారు 15 ఎకరాల సువిశాల మైదానాన్ని వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు చదును చేయించడం, వాకర్స్ వాకింగ్ చేయడానికి అనువుగా ట్రాక్ ఏర్పాటు చేయడం, ప్రహరీ కట్టించడం, చుట్టూ రంగులు వేసి అందరికీ అనుకూలంగా మైదానాన్ని తయారు చేశారు. ప్రస్తుతం రెండు రోజులుగా వాకర్స్ సభ్యులంతా కలిసి చదును చేయిస్తున్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్బరామరాజు, సుబ్బరాజు, సురేష్, శ్రీధర్, రంగారెడ్డి, మోహన్‌రాజు, శంకర్‌రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమి పూజ

చిట్వేలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సి.కందులవారిపల్లె పంచాయతీ రెడ్డిపల్లెలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు శుక్రవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. సంపూర్ణ గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ఖాదీ విలేజ్ ఇండస్ట్రీయల్ చైర్మన్ కేకే చౌదరి, బాలు రామాంజనేయులు, లారీ సుబ్బరాయుడు, బాలు రెడ్డయ్య, యువనేత కాకర్ల నాగార్జున, సర్పంచ్ యామల శ్రీదేవి, వెంకటేశ్‌రాజు, గూడూరు నాగరాజు, కరీంబాషా, అనంతయ్యయాదవ్, ఎంపీడీఓ మోహన్, గ్రేడ్-1 అధికారి రామసుబ్బారెడ్డి, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

మాన్యం భూమి అన్యాక్రాంతంపై విచారణ

పుల్లంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భావనారుషి దేవస్థానం పరిధిలోని గంగమ్మతల్లి మాన్యం అన్యాక్రాంతంపై శుక్రవారం జిల్లా ఎండోమెంట్ అధికారి విశ్వనాధం విచారణ చేపట్టారు. ముందుగా గంగమ్మతల్లి గుడి ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన ఆలయ మాన్యం అన్యాక్రాంతంపై దేవస్థానంలో గ్రామస్థులతో చర్చించారు. అనంతరం అన్యాక్రాంతమైన మాన్యం స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థుల నుంచి సమాచారాన్ని సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఎస్‌బీవీడీ సభ కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, శివపార్వతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సోము బాలాజీబాబు, బలిజసేన అధ్యక్షులు పసుపులేటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో వికలాంగ పింఛన్ల పరిశీలన



ఇంట్లో వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

పుల్లంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలో శుక్రవారం రిమ్స్ వైద్యులు వికలాంగుల పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. లబ్ధిదారులను పరిశీలించి సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. మండల పరిషత్ ఏఓ శ్రీధర్‌రెడ్డి, ఈఓఆర్డీ ముత్తయ్య, రిమ్స్ వైద్యులు వెరిఫికేషన్ చేపట్టారు. డిజిటల్ అసిస్టెంట్ నారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో ఘనంగా రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జనవరి24(ఆంధ్రజ్యోతి): స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్యస్వాములు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా వినతులను సత్వరమే పరిష్కరిస్తామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజా వినతులు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రజా వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా సమస్యలు ఉండకూడదని, ఐదేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేస్తామని వివరించారు. ప్రతి మండలంలో నెలకొన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసేన నేతలు ఉత్తరాది శివకుమార్, వరికూటి నాగరాజు, పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, ఆలం రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకున్న ప్రజలు

నందలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇసుకపల్లి రోడ్డు పనులను శుక్రవారం మధురాచారి వీధి ప్రజలు, మాజీ వార్డు మెంబర్ తోట శివశంకర్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ప్రజలు మాట్లాడుతూ రోడ్డు వేస్తే మా రోడ్డుతో కలిపి వేయండి లేదా వేయవద్దని డిమాండ్ చేశారు. 20 ఏళ్లగా వర్షం కురిస్తే రోడ్డుపై నీళ్లు నిలబడుతున్నాయని, ఎన్నిమార్లు పంచాయతీ వారికి మొరపెట్టుకున్నా రోడ్డు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ రోడ్డు వేస్తే మా ఇళ్లల్లోకి నీళ్లు వచ్చి ఇబ్బందులు పడతామన్నారు. మా సమస్యకు పరిష్కారం చూపి తరువాత రోడ్డు వేయండి అని పట్టుబట్టారు. కాంట్రాక్టర్‌తో మాజీ వార్డు సభ్యుడు తోట శివశంకర్ మాట్లాడి అభివృద్ధి పనులను అడ్డుకోవడం మా ఉద్దేశం కాదని, తమ సమస్యకు పరిష్కారం దొరకాలని, తాత్కాలిక పరిష్కారంగా మధ్యలో రోడ్డు కొంతభాగం వేయకుండా తరువాత వేయాలని సూచించి పనులు ప్రారంభించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టరా..?

రాయచోటిటౌన్, జన వరి24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద అక్రమంగా కట్టిన అపార్టుమెంట్ యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోరని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నేత మావులూరి విశ్వనాధ్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన స్థానిక సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అక్రమ కట్టడాలను తొలగించాలని, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారన్నారు. మున్సిపల్ అధికారులు హడావుడి చేసి అపార్టుమెంట్‌లో రెండు ఫిల్లర్స్ రెండు ముక్కలు పగలగొట్టి వదిలేశారన్నారు. పేద ప్రజలు అరకొర స్థలంలో ఇళ్లు వేసుకుంటే అధికారులు ఆగమేఘాల మీద పోయి యంత్రాలతో కూల్చేస్తారని ఆయన విమర్శించారు. చట్టాలు ఉండేది ధనవంతులకేనా పేదలకు లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన భూ ఆక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ బోర్డు కౌన్సిల్ సభ్యుడిగా సుదర్శన్‌రెడ్డి



రాజంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా రాజంపేట న్యాయవాది హస్తవరం సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఇక నుంచి ఏపీఎస్పీడీసీఎల్ పెండింగ్ కేసులను సత్వరమే వాదిస్తారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతను నిక్కచ్చిగా వ్యవహరిస్తూ కక్షిదారులకు న్యాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

సంబేపల్లె, జనవరి24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా సుబ్రహ్మణ్యంరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్ ఎల్, ఏ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ సంబేపల్లె ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం వెంకటేశ్వర్లు సుబ్రహ్మణ్యంరెడ్డికి రికార్డులు అప్పగించారు.

నిల్వ ఉన్న నీటిని తొలగించండి

సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు

సిద్దవటం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లె పంచాయతీ పత్రపల్లెలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ వాటర్ ట్యాంకుల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడంతో లార్వా ఉత్పత్తి అవుతుందని, నీటిని ఎప్పటి కప్పుడు తొలగించి బ్లీచింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ వైద్యాధికారి డాక్టర్ శ్వేత, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, వైద్య సిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

రైల్వేకోడూరు రూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): మైసూరివారిపల్లి పంచాయతీ పరిధి ప్రధాన జాతీయ రహదారి జ్యోతి నగర్ వద్ద శుక్రవారం అరటి లోడుతో చెన్నైకు వెళ్తున్న ఐషర్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంపై విచారిస్తున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

ఎర్రమట్టి తరలింపుపై ఫిర్యాదు

సంబేపల్లె, జనవరి24(ఆంధ్రజ్యోతి): మోటకట్ల పొలం నుంచి ఎర్రమట్టి తరలిస్తున్నట్లు రైతు కందూరి రామచంద్రనాయుడు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఎర్రగొండ సమీపంలో సర్వే నెంబర్ 1013/7, 1013/8, 1013/9, 1014 సంబంధించిన ఉమ్మడి వ్యవసాయ పొలం నుంచి మట్టిని తరలించడంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి స్పందించి మట్టి తరలింపును నిలిపివేయాలని ఆర్ఐ, వీర్ఓలకు తెలియజేశారు. వారు మట్టి తరలింపు ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఉమ్మడి పొలం కాబట్టి మట్టి తరలింపును నిలిపి వేయాలని తెలియజేయడంతో మట్టి తరలింపును నిలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

రైల్వేకోడూరు రూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ రాజంపేట మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ విద్యార్థులను హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించాలి

పెనగలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలు నేటి సమాజంలో పెద్దలు చెప్పినట్లు నడుచుకుంటూ క్రమశిక్షణతో ఉన్నత విద్యాభ్యాసం చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రామలక్ష్మీ సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పెనగలూరు కేజీబీవీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.విజయకుమారి అధ్యక్షతన బేటీ బచావో బేటీ పడావోలో ఆమె మాట్లాడుతూ నేటి రోజుల్లో ప్రతిఇంట్లో స్మార్ట్‌ఫోను ఉందని, దాని అవసరమేరకే వినియోగించుకోవాలని కోరారు. సెల్‌ఫోన్ వినియోగంతో మంచికంటే చెడు కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

పెంచిన కూలీ రేట్లు అమలుకు జీఓ విడుదల చేయాలి



లక్కిరెడ్డిపల్లె సివిల్ సప్లయ్ గోదామ్ వద్ద మోకాళ్లపై నిబలడి నిరసన తెలుపుతున్న హమాలీలు

రాజంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై కార్మికులకు పెంచిన కూలీ రేట్లను తక్షణం అమలు చేయాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి సికిందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సివిల్ సప్లై గోడౌన్ మూసివేతకు శుక్రవారం స్థానిక గోడౌన్ బంద్‌చేసి నిరసన చేపట్టిన ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లై కార్పొరేషన్, పాలకవర్గాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచాల్సి ఉందన్నారు. పెంచిన కూలీ రేట్ల జీఓల కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా చర్చల్లో పాల్గొని ఆమోదించిన కూలీ రేట్ల పెంపుదలను రూ.25 నుంచి రూ.28కు పెంచి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఏఐటీయూసీ నేతలు జమాల్, సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సూరి, కార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు ప్రసాద్, కోదండం, చౌడయ్య, ఈశ్వర, రామాంజనేయులు, వెంకటేశ్, గంగన్న, వీరన్న పాల్గొన్నారు.

వెంటనే జీఓ విడుదల చేయాలి

లక్కిరెడ్డిపల్లె,జనవరి 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రేట్లు అమలుకు ప్రభుత్వం వెంటనే జీఓ విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం సివిల్ గోదామ్ వద్ద హమాలీ కూలీలతో నిరసనకు దిగారు. వైసీపీ ప్రభుత్వంలో 13 నెలలుగా సక్రమంగా హమాలీ కూలీలకు కూలీ డబ్బు సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ పాలక ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ప్రతి రెండేళ్లకు ఒకసారి కూలీ రేట్లు పెంచాలని కూలీరేట్ల ప్రకారం అరియర్స్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లయ్ గోదాములు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెంచిన రేట్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నేతలు జగదీష్,సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్, షఫీవుల్లా, ముబారక్, తాజ్‌బాబా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.19.88 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తంబళ్లపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి దేవస్థానానికి సంబంధించిన వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి నిర్వహించిన వేలం ద్వారా రూ.19,88,000లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. శుక్రవారం మల్లయ్యకొండ పైన ఆలయం వద్ద కూటమి నాయకులు, ఆలయ ఈవో, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఎస్ఐ లోకేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో హక్కులు పొందిన వారికి 2025 ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు హక్కులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, ఉత్తమ్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్య నిర్వాహన కార్యదర్శి సోముశేఖర్, ఆనందనాయుడు, సుధాకర్‌రెడ్డి, ఆదిరెడ్డి, మ్యూజికల్ శివ, మాజీ ఉపసర్పంచ్ మణి, మాజీ మల్లయ్యకొండ చైర్మన్ గంగులిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, మదన్‌మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కొండకిట్ట, ఈశ్వర, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

- గుంతకల్లు డివిజన్ రైల్వే సలహా సభ్యుడు



సమస్యలపై స్టేషన్ మాస్టర్‌కు విన్నవిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రైల్వేస్టేషన్ మాస్టర్ రాజీవ్‌కుమార్‌కు గుంతకల్లు డివిజన్ రైల్వే సలహా సభ్యుడు తల్లం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో కరోనాతో నిలిపేసిన రైళ్లు ఇక్కడ ఆగడం లేదని గుంతకల్లు రైల్వే డివిజన్ డీఆర్ఎంకు ఇప్పటికే వినతిపత్రం సమర్పించామని వివరించారు. రైల్వేస్టేషన్ ముందు భాగంలో ఆర్చి లేదని, దీంతో రైల్వేస్టేషన్‌ను ప్రయాణికులు గుర్తించడం కష్టంగా ఉందన్నారు. ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఉన్నాయని, ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం ఉందన్నారు. రైల్వేస్టేషన్ ముందు భాగంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, రైలు దిగి ప్రయాణికులు వస్తున్న సమయంలో గంజాయి, మద్యం తాగిన వ్యక్తులు ఉంటారని దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. విన్నవించిన సమస్యలను ఉన్నతాధికారులకు పంపి పరిష్కారిస్తామని స్టేషన్‌మాస్టర్ సానుకూలంగా స్పందించారు.

దాడిలో గాయపడిన జనసైనికుడికి నాయకుల పరామర్శ



చికిత్స పొందుతున్న మునీర్

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రౌడీ మూకల దాడిలో గాయపడి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరుకు చెందిన జనసైనికుడు మునీర్(34)ను శుక్రవారం పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల జనసేన నాయకులు పరామర్శించారు. కందూరు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో మునీర్ గాయపడడంతో అతనిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పీలేరు జనసేన ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, పుంగనూరు జనసేన నాయకులు చిన్నా రాయల్, వేణుగోపాల్‌రెడ్డి అతనిని పరామర్శించారు. దాడి జరిగిన తీరు, దాడిలో పాల్గొన్న వారు, దాడి తరువాత జరిగిన పరిణామాలు అతన్ని అడిగి తెలుసుకున్నారు. అతనికి అందుతున్న వైద్యం గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇతరులపై భౌతిక దాడులకు పాల్పడడం హేయకరమన్నారు. మునీర్‌కు తమ పార్టీ అండగా ఉంటుందని, పార్టీ అధినాయకుల ఆదేశానుసారం చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి మునీర్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పీలేరు, పులిచెర్ల, పుంగనూరు, సోమల మండలాలకు చెందిన పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

శివుని కొండలకు ఉపాధి బాటలు

- రూ.4.30 కోట్లతో రోడ్ల నిర్మాణం
- ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి శ్రీకారం
- శివరాత్రికి పనులు పూర్తయ్యేలా చర్యలు

మదనపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలోని కొండలపై కొలువుదీరిన మల్లేశ్వరస్వామి ఆలయాలకు రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే భక్తుల సౌకర్యార్థం కొండలపై వెలసిన శివాలయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండకు, రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి, చెంబకూరులోని గట్టు వెంకటరమణస్వామి ఆలయాలకు భక్తులు వెళ్లేందుకు వీలుగా ఉపాధి హామీ పథకం కింద రూ.4.30 కోట్లతో తారురోడ్లు నిర్మిస్తున్నారు.

వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండకు రూ.1.45 కోట్ల వ్యయంతో తారురోడ్డు నిర్మిస్తున్నారు. మదనపల్లె నుంచి పది కి.మీ. దూరంలోని ఈ కొండపైకి వెళ్లాలంటే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపైకి వెళ్లడానికి రెండుమార్గాలు ఉండగా అందులో గుట్టకిందపల్లె నుంచి కొండమీదపల్లె తాండాకు ఇదివరకే రోడ్డు ఫార్మేషన్ చేసి వైసీపీ ప్రభుత్వంలో తారురోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి కూడా రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. అలాగే రెండోమార్గం మునగమాకులపల్లె నుంచి నాలుగు కిలోమీటర్లు కొండ ప్రాంతం. ఈ క్రమంలో మాజీ వీఆర్వో చిప్పిలి జగన్నాథరెడ్డి ఇదివరకే మొదటి మార్గంలోని గుట్టకిందపల్లె నుంచి గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనికి ఆహార పథకం, తర్వాత ఉపాధి హామీ పథకాలతోపాటు స్థానికుల సహకారంతో శ్రమదానంతో రోడ్డు ఫార్మేషన్ చేయించారు. అలాగే రెండో మార్గంలోనూ ఇదే తరహాలో మునగమాకులపల్లె మార్గంలోని కొండ కింద నుంచి 2.10 కి.మీ.కొండపైకి మట్టిరోడ్డు ఫార్మేషన్ చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం దీనిని తారురోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేస్తూ, క్రాసింగ్‌లను మరింత తగ్గిస్తూ, రాళ్లను పేల్చి రోడ్డు చదును చేస్తున్నారు. మూడు నెలలుగా ఈ పనులు ముమ్మరంగా జరుగు తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే కొండపైకి వాహనాలు వెళ్లే విధంగా పనులు పూర్తి చేశారు. దీంతో మదనపల్లె పట్టణంతో పాటు వేంపల్లె, అంకిశెట్టిపల్లె, కొత్తపల్లె, బొమ్మనచెరువు, కోటవారిపల్లె పంచాయతీలోని 40 గ్రామాల ప్రజలు కొండపైకి వెళ్లడానికి అవకాశం ఏర్పడటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెలలో జరగనున్న మహాశివరాత్రి వేడుకల నాటికి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.



మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపైకి పూర్తయిన రోడ్డు ఫార్మేషన్

గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి..

రామసముద్రం మండలంలోని చెంబకూరు మెయిన్‌రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలోని వైఎస్సార్ కాలనీకి సమీపంలోని గుట్టకింద వెలసిన గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి రూ.85 లక్షలతో తారు రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ మూడు ఆలయాలకు ఇప్పటికే రోడ్డు ఫార్మేషన్ పూర్తికాగా గట్టు వెంకటరమణస్వామి ఆలయం మార్గంలో కంకర పరిచే పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా నిధుల మంజూరుకు కృషి చేశారు. ఈ పనులను పంచాయతీరాజ్ డీఈ శివప్రసాద్ పర్య వేక్షిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా భక్తుల సౌకర్యార్థం శివరాత్రి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి గ్రావెల్ రోడ్డు పూర్తయి తారురోడ్డుకు సిద్ధమైన కంకర పనులు

వాలీశ్వరస్వామి కొండపైకి..

రామసముద్రం మండలంలోని ప్రముఖ వాలీశ్వరస్వామి కొండపైకి కూడా ఇదే తరహాలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. రామసముద్రం మండలం నడింపల్లె నుంచి ఎనిమిది కిలోమీటర్లు దూరం ఉంది. ఇక్కడి నుంచి 4.80 కి.మీ. దూరం కొండమార్గం ఇది. ఏటా శివరాత్రి రోజున తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. కొండపైకి సరైన రోడ్డుమార్గం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ కూడా ఇదివరకే మాజీ వీఆర్వో జగన్నాథరెడ్డి కొండను తొలచి, రాళ్లను పేల్చి రోడ్డు ఫార్మేషన్ చేయించారు. ఇందులో సొంత నిధులతో పాటు దాతల సహకారంతో ఈ పనులు చేపట్టారు. అయినా పనులు పూర్తి కాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం వేంపల్లె మల్లయ్యకొండ తరహాలో ఇక్కడి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం రూ.7 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా, మొదటి విడతగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మూడు నెలలుగా ముమ్మరంగా పనులు చేపడుతున్నారు.



రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి కొండపైకి జరుగుతున్న రోడ్డు పనులు

సాగునీటి నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాల్వ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచి ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పంట కాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని, కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమ పంట పొలాలకు నికరసాగు జలాలు తీసుకురావడానికి అనేక ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. వ్యవసాయం కనీసంగా జీవించాలంటే సాగులోని 30 శాతం భూమికి కనీస సాగునీటి వనరులు కల్పించాలని, జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందని తెలిపారు. హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేలు, అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుత కాల్వ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేదని, వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని, 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగ సభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రకటించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాల్వ గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, శివరామకృష్ణ దేవర, సుమిత్రమ్మ, మనోహర్‌రెడ్డి, జ్యోతి, చిన్నయ్య, మురళీ, సుధీర్‌కుమార్, వెంకటేశ్, కోటేశ్వరరావు, సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

రెవెన్యూ..పోలీసుల రక్షణతో భూమి స్వాధీనం

రామసముద్రం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కౌలుకు ఇస్తే భూమి తమదేనని తప్పుడు రికార్డులు సృష్టించి కబ్జా చేశారని బాధిత మహిళ లక్ష్మమ్మ సీఎంవోకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాలతో కబ్జాదారుల నుంచి భూమిని లక్ష్మమ్మ స్వాధీనం చేశారు. బాధిత మహిళ వివరాల మేరకు మండలంలోని నాగిగానిపల్లె పంచాయతీ ఎర్రనేలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ భర్త వెంకటరమణరాజుకు సర్వే నెంబర్218/1సీలో 2.75 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన సురేంద్రరాజుకు వెంకటరమణరాజు కౌలుకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వెంకటరమణరాజు మృతి చెందగా సురేంద్రరాజు కౌలు భూమికి సంబంధించి దొడ్డిదారిన పట్టా రూపొందించుకున్నాడు. ఈ విషయమై బాధిత మహిళ స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌కు పట్టించుకోలేదని లక్ష్మమ్మ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి బాధిత మహిళ లక్ష్మమ్మకు అప్పగించాలని తహసీల్దార్ నిర్మలాదేవికి గత ఏడాది నవంబర్ 20న ఆదేశాలిచ్చారు. ఇందుకు అనుగుణంగా రెవెన్యూ, పోలీసు సిబ్బందితో తహసీల్దార్ వివాదాస్పద భూమిని పరిశీలించి సర్వే చేసి కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుని బాధితురాలు లక్ష్మమ్మకు అప్పగించారు. అయితే భూమి కబ్జాదారులు అప్పటికే భూమిలో పంటసాగు చేయడంతో పంట నూర్పిడి కోసం కొంత సమయమిచ్చారు. గురువారం రెవెన్యూ, పోలీసు సిబ్బంది రక్షణలో లక్ష్మమ్మకు భూమిని స్వాధీనం చేశారు. ఈ భూమి గత 30ఏళ్లుగా తమ అనుభవంలో ఉందని, దురుద్దేశంతో దౌర్జన్యంగా తమ భూమిని లాక్కున్నారని, తమకు దక్కకపోతే మరణమే శరణ్యమని మీడియాతో వాపోయారు.

రవాణా వ్యవస్థ ప్రైవేటీకరణకు కేంద్రం యత్నం

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల ముసుగులో దేశంలోని ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఏపీపీటీడీ(ఆర్టీసీ)లోని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు ఆరోపించారు. పీలేరు డిపో కార్యాలయం ముందు వారు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రజా రవాణా వ్యవస్థల్లోకి విద్యుత్ బస్సుల నిర్వహణ ద్వారా ప్రైవేటు యాజమాన్యాలు, కార్పొరేట్ శక్తులను చొప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. 2029 నాటికి ప్రజారవాణా వ్యవస్థలోని 100 శాతం బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలంటూ నిర్ణయం తీసుకోవడం అందులో భాగమేనన్నారు. ఈ నిర్ణయం అమలైతే ఆర్టీసీ కూడా ప్రైవేటీకరణ కావడం తథ్యమని, ఆర్టీసీనే నమ్ముకున్న కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయానికి వ్యతిరేకంగా మార్చి 24న జరిగే 'చలో పార్లమెంటు' కార్యక్రమాన్ని ఆర్టీసీలోని కార్మికులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కేసీఎస్ రెడ్డి, హెచ్‌ఎం బాబు, ఎంసీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పీలేరు డిపో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

హౌసింగ్ కుంభకోణంపై విచారణ చివరి దశకు

- వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి
- ప్రాథమిక విచారణలో రూ.38 కోట్లు గోల్‌మాల్
- పునర్విచారణలో రూ.44 లక్షలకు కుదింపు
- ముగ్గురు విశ్రాంత హౌసింగ్ ఇంజినీర్లపై చర్యలకు రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలికిరి/ప్రొద్దుటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హౌసింగ్ కుభకోణంపై పదిహేనేళ్ల క్రితం ప్రారంభమైన విచారణ చివరి దశకు చేరుకుంది. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలు వెలువరించిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా ముగ్గురు ఉన్నత స్థాయి హౌసింగ్ ఇంజినీర్లు అక్రమాలు, అవినీతికి పాల్పడ్డట్లు విచారణలో తేలింది. చివరి దశ విచారణలో తేలిన అంశాలపై ఈ ముగ్గురి నుంచి పది రోజుల గడువుతో వివరణలు కోరుతూ ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసింది. అప్పట్లో ప్రొద్దుటూరు గృహనిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేసి నెల్లూరు ఈఈగా 2023 జూలై 31న పదవీ విరమణ చేసిన పి.నాగేశ్వరరావు, ప్రొద్దుటూరులో హౌసింగ్ ఈఈగా పనిచేసి 2022 ఏప్రిల్ 30 కడప హౌసింగ్ ఎస్ఈ/జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జిగా పదవీ విరమణ చేసిన ఎన్.రాజశేఖర్, ప్రొద్దుటూరు హౌసింగ్ డీఈఈగా పనిచేస్తూ 2023 మార్చి 31న రిటైర్డ్ అయిన ఆర్.వీరన్నలను జరిగిన అక్రమాలు, అవినీతికి ప్రభుత్వం బాధ్యులుగా తేల్చింది.

అమృతనగర్ ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు

ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. వైఎస్సార్ సీఎంగా వుండగా ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామం అమృతనగర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. సమీకృత గృహ నిర్మాణం మరియు మురికివాడల అభివృద్ధి పథకం కింద ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఈ కాలనీ గృహ నిర్మాణాల్లో అనేక అవకతవకలు, అవినీతి జరిగిందని అప్పట్లో ఆంధ్రజ్యోతి సమగ్ర కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టరు వెంటనే విచారణకు ఆదేశించారు. అప్పటి కడప, కర్నూలు జిల్లాల ప్రత్యేక అధికారి సమగ్రంగా విచారణ చేయడానికి పలు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేయించారు. మొత్తం రూ.38 కోట్ల, 97 లక్షల, 23 వేల, 455లు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఈ మొత్తం అక్రమాలకు, అవినీతికి నిర్మాణాలను పర్యవేక్షించిన ఇంజినీర్లనే బాధ్యులుగా నిర్ధారించారు. దీనిపై తదుపరి చర్యల కోసం ఇంజినీర్లకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసి సంజాయిషీలు కోరింది. అయితే కడప, కర్నూలు జిల్లాల ప్రత్యేక అధికారి నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా విచారణ జరపలేదని, సాంకేతిక నిపుణులైన అధికారుల చేత తిరిగి విచారణ చేయించాలని ఇంజినీర్లు ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై పునర్విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి హౌసింగ్ సూపరింటెండెంట్ ఇంజినీరు కె.వెంకట నారాయణతో విచారణ జరిపించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే విచారణకు అవసరమైన పత్రాల్లో చాలా భాగం అందుబాటులో లేకపోవడంతో ఉన్నంతలో క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించి నివేదిక అందజేశారు. మొత్తం మీద ఇంజినీర్లు ఉమ్మడిగా రూ.43,63,550ల అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారని విచారణాధికారి ధ్రువీకరించారు. ఇంజినీర్లు విడివిడిగా రూ.10 లక్షలు దుర్వినియోగం చేసినట్లుగా కూడా విచారణలో తేలింది.

అక్రమాలు జరిగిన వివరాలు

గృహ నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులు ఉమ్మడిగా రూ.43,63,550లు దుర్వినియోగానికి బాధ్యులుగా పునర్విచారణలో నిర్ధారణ అయింది. ఇందులో రెండిళ్లను కలిపి నిర్మించడంలో రూ.63,000, నిర్మాణ స్థాయిల వ్యత్యాసాల్లో రూ.77,500, రెండుసార్లు చెల్లింపుల ద్వారా (డబుల్ పేమెంట్) రూ.13,84,450, ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగం ద్వారా రూ.11,93,600, అడ్మినిస్ట్రేటివ్ ఫీజుల (ఏడీఎఫ్) దుర్వినియోగం రూ.16,45,000లు మొత్తం రూ.43,63,550లు అవినీతి జరిగిందని ప్రభుత్వం వివరించింది. అంతేగాకుండా అప్పటి డీఈఈ ఆర్.వీరన్న ఏడీఎఫ్ నిధుల్లో రూ.7,75,000లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎన్.రాజశేఖర్ రెండేసి మార్లు చెల్లింపుల ద్వారా రూ.2,38,200, ఏడీఎఫ్ నిధుల్లో రూ.5000లు వంతున అక్రమాలకు పాల్పడ్డట్లు తేల్చారు. మొత్తం మీద ఇంజినీర్లు లబ్ధిదారులతో కుమ్మక్కై అనేక అక్రమాలకు పాల్పడిన వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన దరిమిలా ఈ విచారణలు చేపట్టినట్లు ప్రభుత్వం విడుదల చేసిన జీవోల్లో ప్రస్తావించింది. కాగా మొదటి విచారణలో తేలిన దుర్వినియోగం సొమ్ము మొత్తం రూ.38 కోట్ల 97 లక్షల 23 వేల 455లకు సంబంధించిన రికార్డులేవీ అందుబాటులో లేనందున దాన్ని వదిలేసి తాజాగా పునర్విచారణలో నిర్ధారణయిన రూ.43,63,550ల వరకే చర్యలుంటాయా అన్న విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. కాగా పునర్విచారణకు సంబంధించిన దుర్వినియోగమైన నిధులకు సంబంధించి పది రోజుల్లోగా సంజాయిషీలు పంపుకోవాలని ముగ్గురు ఇంజినీర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఆ తరువాత తగు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఐదు వేర్వేరు జీవోలు జారీ చేశారు.

మల్లయ్యకొండ పైన ప్లాస్టిక్ కవర్లు నిషేధం

తంబళ్లపల్లె, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ పైన ప్లాస్టిక్ కవర్లను నిషేధించినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. శుక్రవారం ఈవో మీడియాతో మాట్లాడుతూ...మల్లయ్యకొండపైన కవర్లు, వాటర్ ప్యాకెట్ల కవర్లను భక్తులు ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారన్నారు. ఈ కవర్లను దేవస్థానం ఆవులు తిని అనారోగ్యం బారిన పడుతున్నాయన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి కొండ పైన వాటర్ ప్యాకెట్లు, ఇతర కవర్లను తీసుకురాకుడదని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారికి రూ.5 వేల జరిమానాతో పాటు చర్యలు తీసుకుంటామని ఈవో పేర్కొన్నారు.

పీలేరు విద్యుత్ శాఖ బీఎల్‌సీగా అడ్వకేట్ చిన్నరెడ్డెప్ప



పీలేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ (ఆపరేషన్) పీలేరు డివిజన్ బోర్డు లీగల్ కౌన్సిల్ (బీఎల్‌సీ)గా స్థానిక న్యాయవాది బి.చిన్నరెడ్డెప్పను నియమిస్తూ తిరుపతి ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్‌బాబు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 1 నుంచి 2028 జనవరి 31 వరకూ అంటే మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. చిన్నరెడ్డెప్ప సేవలకు గానూ నెలకు రూ.20 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు సీఎండీ ఉత్తర్వులో పేర్కొన్నారు. వాయల్పాడులో పుట్టి పెరిగిన ఆయన గత 28 ఏళ్ళుగా చిన్నరెడ్డెప్ప పీలేరులో న్యాయవాది గా కొనసాగుతున్నారు. చిన్నరెడ్డెప్ప నియామకంపై పలువురు న్యాయవాదులు, విద్యుత్ శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

ఎస్‌బీఐలో ఖాతాదారులకు మెరుగైన సేవలు

నిమ్మనపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమని మేనేజరు భానుప్రకాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా నూతనంగా నిర్మించిన భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిమ్మనపల్లి శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఖాతాదారులకు సేవింగ్స్, కరెంట్ ఖాతాలు, రికవరింగ్ ఖాతాలతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా 24 గంటలు ఏటీయంను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులకు, ప్రజలకు విరివిగా తక్కువ వడ్డీకే వ్యవసాయ, బంగారు రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రశేఖర్, షఫీ, శ్రీశాంత్ పాల్గొన్నారు.

ఓటరు నమోదులో బీఎల్వోలదే కీలకపాత్ర

నిమ్మనపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు చేయడంలో బీఎల్వోలదే కీలక పాత్ర అని తహసీల్దారు ధనుంజయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఓటరు దినోత్సవంపై శనివారం ర్యాలీ నిర్వహించి ప్రలజకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తామన్నారు. అదేవిధంగా ఆదివారం 22 పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఖచ్చితంగా హాజరై ఓటరు లిస్టులో చేర్పులు, తొలగింపులను చేపట్టాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే నల్లారి విస్తృత పర్యటన

● కాలనీలు, అన్న క్యాంటీన్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన



పీలేరులోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పీలేరులో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విధంగా పేదలకు ఇంటి నివేశనా స్థలాలు, అన్న క్యాంటీన్‌ల ఏర్పాటు కోసం స్థల పరిశీలన జరిపారు. కొత్త కాలనీ ఏర్పాటు కోసం స్థానిక ఆయిల్ సీడ్స్ ప్రాంగణంతోపాటు మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ-3, 4 లే-ఔట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఆయిల్ సీడ్స్ ప్రాంగణం వద్ద ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల స్థలం అందజేస్తామన్నారు. గత ప్రభుత్వ హయంలో మాదిరి కాకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా చేపడతామన్నారు. అదే విధంగా గతంలో ఆయిల్ సీడ్స్ కర్మాగారం నిర్మాణానికి ఎటువంటి పరిహారం ఆశించకుండా భూములు అందించిన వారికి కూడా ఇళ్ల స్థలాలు అందజేస్తామని ప్రకటించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నారే సతీశ్, కోటపల్లె శ్రీనాథరెడ్డి, పురం రామ్మూర్తి, అమరనాథరెడ్డి, అబ్బవరం అమరనాథరెడ్డి, లక్ష్మీకర, లడ్డూ జాఫర్, సురేంద్ర, రమాదేవి, షౌకత్ అలీ, చాన్‌బాషా, రహంతుల్లా, సుబ్బయ్య, ఖాజాపీర్, తహసీల్దారు భీమేశ్వరరావు, ఎంపీడీవో శివశంకర్, సర్వేయర్ కిరణ్మయి, హౌసింగ్ డీఈ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెరిక బలిజలకు కులధ్రువీకరణ పత్రాలు ఇప్పించండి

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలోని అర్హులైన పెరిక బలిజలకు ఆ కులధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని పీలేరులోని బలిజ సంఘం సభ్యులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేకు గురువారం రాత్రి వారు ఈ మేరకు వినతి పత్రం అందించారు. గత కొన్నేళ్లుగా పీలేరు నియోజకవర్గంలో పెరిక బలిజ కులస్థులకు ఆ కులధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరిస్తున్నారని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. అయితే ఈ విషయంలో నెలకొన్న సాంకేతిక సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అదే విధంగా పీలేరు పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం, బలిజ భవన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరడంతో రెవెన్యూ అధికారులతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. అనంతరం బలిజ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పోతంశెట్టి రమేశ్, లక్ష్మీకర, రామచంద్ర, పచ్చార్ల వెంకటరమణ, జ్ఞానంగారి హరీశ్, నాగేంద్ర, మనోహర, రామిశెట్టి మనోహర, రెడ్డప్ప, సురేశ్ బాబు, లోకనాథం, రాయల సుధాకర్, కృష్ణకుమారి, కళావతి, చరిత, పీవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

యువత ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట

● చంద్రన్న స్వయం ఉపాధి రుణాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి
● 50 శాతం నియోజకవర్గానికి 300 యూనిట్లు మంజూరు
● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న స్వయం ఉపాధి రుణాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, పెద్దమండ్యం, కురబలకోట మండలాలకు సుమారు 300 స్వయం ఉపాధి రుణాల యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్, రెడ్డి, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా 50 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు అందిస్తుందన్నారు. రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు అందించే రుణాలకు సగం సబ్సిడీ ఉంటుందన్నారు. అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెట్టుబడులు పెట్టాలని దావో‌స్‌కు వెళ్లి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జగన్ నిరుద్యోగులను ఎన్నడూ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల వ్యవధిలోనే పెద్ద ఎత్తున యువతీ, యువకులకు 50 శాతం సబ్సిడీతో స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు సిద్ధమైందన్నారు. ఈ సమావేశంలో నాయనిచెరువుపల్లె సర్పంచ్ సంధ్యా జనార్దన్‌రెడ్డి, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, సుబ్బినాయుడు, ఎర్రంరెడ్డి, భజంత్రి రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య రాకుండా చూడండి

ములకలచెరువు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఐ నాయకులు శుక్రవారం ఎంపీడీవో హరినారాయణకు విజ్ఞప్తిచేశారు. ఆమేరకు వారొక వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప మాట్లాడుతూ ములకలచెరువులోని పలు ప్రాంతాల్లో తాగునీటి కుళాయిల్లో నీరు సక్రమంగా వదలడం లేదన్నారు. పది రోజులకు ఒక సారి కూడా నీరు వదలకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లప్ప, కృష్ణప్ప, చంద్ర, రైతు సంఘం నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్టు

మదనపల్లె అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి):పోక్సో కేసులో నిందితున్ని అరెస్టు చేసినట్లు శుక్రవారం టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గుర్రంకొండ మండలం, అమిలేపల్లెకు చెందిన చరణ్‌తేజ్(19))మదనపల్లెకు చెందిన ఓబాలికను ప్రేమ పేరుతో వెంట తీసుకెళ్లడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, టూటౌన్ సీఐ రామచంద్ర ఆదేశాల మేరకు నిందితున్ని శుక్రవారం టూటౌన్ ఎస్‌ఐలు రహంతుల్లా, గాయిత్రి అరెస్టు చేసినట్లు తెలిపారు.

రోడ్డు భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



వాల్మీకిపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

వాల్మీకిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే వాహనాలు సీజ్ చేస్తామని వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు హెచ్చరించారు. శుక్రవారం మదనపల్లె-తిరుపతి రోడ్డులోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో వాహనాలు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈసందర్భంగా రికార్డులు సక్రమంగాలేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు, ట్యాక్సీలు విధిగా సీట్‌బెల్టు ధరించి వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్లు ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చంద్రశేఖర్, శ్రీహరి, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

కట్టా క్రికెట్ టోర్నమెంటు విజేత విజయ్ జట్టు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న టీడీపీ నేత దొరస్వామినాయుడు, సీఐ లక్ష్మన్న

ములకలచెరువు, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): ములకల చెరువులో టీఎస్ఎన్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు నిర్వహిస్తున్న కట్టా క్రికెట్ టోర్నమెంటు విజేతగా ముల కలచెరువు విజయ్‌నా యుడు, జయ జట్టు నిలిచిం ది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 9వతేదీన ప్రారంభమైన కట్టా క్రికెట్ టోర్నమెంటులో శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ములకలచెరువు విజయ్‌నాయుడు. మదనపల్లె గౌతం జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన విజయ్‌జట్టు 12 ఓవర్లకు 98 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన మదనపల్లె గౌతం జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 85 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 32 జట్లు పాల్గొన్న టోర్నమెంటు విజేతగా విజయ్‌నాయుడు జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు నిర్వాహకులు కట్టా దొరస్వామినాయుడు, సీఐ లక్ష్మన్న తదితరులు రూ.1,00116, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.50,116లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు కట్టా విజయ్‌నాయుడు, సాధిక్, ముస్తక్, అమాలు, వెంకి, ఇర్ఫాన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో చెట్లు తొలగింపు

మదనపల్లె అర్బన్, జనవరి24(ఆంధ్రజ్యోతి):మదనపల్లె మున్సిపాలిటీలో బీకేపల్లె ప్రభుత్వ స్థలంలో శుక్రవారం చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. 2007లో ఆర్‌వోసీ నెంబరు1414-2007లో సెటిల్‌మ్మెంట్ భూమి సర్వేనెంబరు 536-1-బి గా నకిలీ పట్టాలను సృష్టించుకుని తయారు చేసుకున్నారు. తీరా స్థలం 1968లోనే కోనుగోలు చేసి ఎస్ మక్బూల్‌సాహెబ్ పేరిట ఉంది. భూ యజమానులు కాలనీ వాసులతో కలిసి అక్రమదారులను తరిమేశారు. ఈ విషయమై మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లగా ఆయన రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆదేశించడంతో చెట్లను తొలగింపజేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. కార్మికుల పదవీవిరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, పనిముట్లతోపాటు ప్రతి కార్మికుడికి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, కృష్ణమూర్తి, చలపతినాయుడు, సాంబశివ, నాయక్, రామకృష్ణ, రాజు, గోపాల్ నరసింహులు, చిన్నరెడ్డెప్ప, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ బ్యాంకు అభివృద్ధికి కృషి చేశాం

పెద్దమండ్యం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిచెర్ల సొసైటీ బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామని బ్యాంకు చైర్మన్ కడప సుధాహరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సొసైటీ బ్యాంకు అభివృద్ధి కోసం పెట్రోలు బంకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. డీసీసీ పర్సన్ రఘునాథరెడ్డి, ఆర్‌ఐ రమేష్, రైతులు పాల్గొన్నారు.

పరిటాల రవికి ఘన నివాళి

మదనపల్లె టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత ఆర్‌జే వెంకటేశ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పరిటాల రవి 20వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మదనమోహన్, వెంకటరమణ, శ్రీనివాసులునాయుడు, రమేశ్, లక్ష్మన్న పాల్గొన్నారు.

టూడిపో మేనేజరుగా అమరనాథ్

మదనపల్లె అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టూడిపో నూతన మేనేజరుగా బి, అమరనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టూడిపో యూనియన్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీసీబోర్డుమెంబర్ వినోద్‌కుమార్, ఎన్ఎంయూ డిపో నాయకులు మునికృష్ణ, చలపతి, ఎంప్లాయిస్ యూనియన్ నేతలు బాబు, హుసేన్, బహుజన నేత నరసింహులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేత పై కేసులు నమోదు

బి.కొత్తకోట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత, రాష్ట్ర మంత్రి నారాలోకేశ్ ఫ్లెక్సీల చించివేత పై రెండుకేసులను నమోదు చేసినట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు శుక్రవారం తెలిపారు. బి.కొత్తకోట లో టీడీపీలోని ఓ వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల ను రాత్రిపూట చించివేశారు. దీనిపై పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు చాకనారాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా తంబ ళ్లపల్లె కు చెందిన అరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాగర్‌కుమార్, నాగార్జున, సుదర్శన్‌లతో పాటు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్వీస్ ప్రొవైడర్ విధానాన్ని వినియోగించుకోండి



మెప్మా ఆర్‌పీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న సర్వీస్ ప్రొవైడర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టౌన్‌హాల్లో మెప్మా ఆధ్వర్యంలో చేతి వృత్తి కార్మికులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాల్లో చేతివృత్తుదారులైన ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు, ఏసీ మెకానిక్, తాపీ మేస్త్రీలను ఒక గ్రూపుగా చేర్చి హోం ట్రయాంగిల్ యాప్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తారన్నారు. అ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న కార్మికులను ప్రజలకు సత్వర సేవలందించడానికి వినియోగించుకోవచ్చన్నారు. హోంట్రయాంగిల్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న కార్మికులకు ప్రజలకు ఏయే సేవలు అందించాలో మెస్సేజ్ వస్తుందని, వారి ఇంటికి వెళ్లి కార్మికులు నిర్దేశించిన ఫీజుతో సేవలందించవచ్చన్నారు. స్విగ్గీ, జొమోటో లాగే హోం ట్రయాంగిల్ యాప్‌లో బుక్ చేసిన ఐదు నిమిషాల్లోనే మెకానిక్‌లు ఇంటికి వచ్చి సేవలందిస్తారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా మహిళలకు ఎంతో ఉపయోగముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మెప్మా సీఆర్‌పీ మధుసూధన్‌రెడ్డి, ఆర్‌పీలు, మెనానిక్‌లు పాల్గొన్నారు.

మదనపల్లె బోధనాస్పత్రిని ప్రభుత్వమే నడపాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి):మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రిని రాష్ట్రప్రభుత్వమే నడపాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్లకు పైగా పేదలకు ఉచిత వైద్య సేంలను అందిస్తున్న మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిని రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తోందని, ఇక్కడ పని చేస్తున్న శాశ్విత వైద్యాధికారులను, సిబ్బందిని ఇరత ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. రోజు 1200 నుంచి 1500 మంది ఔట్ పేషంట్లు వచ్చి ఉచితంగా వైద్య సేవలను పొందుతున్నారని, రక్త నిధికేంద్రం మదనపల్లెలోనే ఉందని ఇప్పుడు ప్రైవేట్ పరంచేస్తే ఇక్కడ ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. మెడికల్ కళాశాలను, ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్ పరం కాకుండా నిలపాలంటూ బీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నెల 27న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమేరకు మహాధర్నా కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాలాజీ, గంగాధర్, శివ, మహేష్, ప్రశాంత్, హరి, కన్నయ్య, ఆనంద్, సారథి, రెడ్డెప్ప, రవితేజా, తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో ఐఈటీఈ స్టూడెంట్స్ ఫోరం ప్రారంభం



మిట్స్‌లో ఐఈటీఈ స్టూడెంట్స్ ఫోరం ప్రారంభిస్తున్న విఐటి ప్రొఫెసర్ విజయేంద్ర తదితరులు

కురబలకోట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈటీ ఈ స్టూడెంట్స్ ఫోరం ప్రారం భించినట్లు విఐటీ ప్రొఫెసర్ విజయేంద్ర పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం ఈసీఈ ఈఈఈ విభాగంల ఆధ్వర్యంలో ఐఈటీఈ(ఎలక్ట్రానిక్స్, టెలికయ్యూనికేషన్ ఇంజనీర్ల సంస్థ)ను విద్యార్థుల కోసం ప్రారం భించామన్నారు. దీని ద్వారా వర్క్‌షాప్‌లు, ఇన్నోవేషన్, సెమినార్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఇది ఎంతగానో దోహదపడుతాయన్నారు. దీని ద్వారా విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభు త్వ సంస్థల మధ్య సహాయసహకారాలు అందిస్తుందన్నారు. జాతీయ,అంతర్జాతీయ వ్యాప్తంగా 63 కేంద్రాల నెట్‌వర్క్ పని చేస్తుందన్నారు. దీనిలో పారిశ్రామిక వేత్తలు, విద్యాసంస్థలు, ఇంజనీర్లు దాదాపుగా 1.25లక్షల మంది సభ్యత్వ సభ్యులను కలిగిఉందన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్‌కు బాసటలు వేసుకో వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతులు పవన్‌కుమార్, రాజశేఖర్, , దినేష్, కో ఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులకు సర్టిఫికేట్లు అందిస్తున్న పోర్డు డైరెక్టర్ , హెచ్ఎం తదితరులు

మదనపల్లె టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో సుజాత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి బాలికలు తెలుసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కాగా బాపూజీ మున్సిపల్ హైస్కూల్లో పోర్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. వారం రోజుల క్రితం నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకుపోర్డు డైరెక్టర్ లలితమ్మ, హెచ్ఎం రఘుపతి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసుంధర, పోర్డు జలజ, సుభాషిణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు చంద్రకాంత, శాంతమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను వాల్మీకిపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పురవీధులలో అంగన్వాడీ మహిళలు బ్యానర్లు, ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమాలలో సీడీపీవో భారతి, ఎంఈవో వెంకటలక్ష్మి, ప్రిన్సిపాల్ నవమల్లిక, సూపర్‌వైజర్లు, మహిళా ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని కస్తూరిబా పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీవో భాగ్యమ్మ ముఖ్య అతిధిగా హాజరై. బాలికలు అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100, జాతీయ అత్యవసర హెల్ప్‌లైన్ 112, సైబర్ హెల్ప్‌లైన్ 1930 తెలసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గౌస్‌పీర్, ఎస్‌వో శైలజ, సూపర్‌వైజర్లు జయరాని, భవాని, రాగరత్న తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: బాలికలు విద్యలో రాణించి దేశాభివృద్ధిలో కీలకం కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమిత్ర, మహిళ పోలీసులు సూజత, నందిని, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో: జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక చిత్తూరు మార్గంలోని అంబేడ్కర్ బాలికల గురుకులంలోని విద్యార్థినులకు ఈ సందర్భంగా ఉన్నత విద్య ఆవశ్యకత, పౌష్టికాహారం, బాల్య వివాహాలతో అనర్థాలు, పోక్సో చట్టం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీఈవో రాజమ్మ, సూపర్‌వైజర్లు స్వరూప, అక్కాయమ్మ, ఉమ, స్వర్ణ, గురుకులం ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: బాలికల విద్యతోనే దేశాభివృద్ధి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, ధనలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెచ్ఎంలు మదన్‌మోహన్, దీప, మేరి, మహిళా పోలీసులు రేవతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ, కేజీబీవీ ఎస్ఓ విశ్వలత, ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనూనాయక్, సూర్‌వైజర్ హిజాద్‌ప్యారీ , కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యారికేడ్లు...కుర్చీలు వితరణ



బ్యారికేడ్లు, కుర్చీలు అందజేస్తున్న సిబ్బంది

ములకలచెరువు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌తో పాటు రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు బ్యారికేడ్లు, కుర్చీలు వితరణ చేశారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ ఏరియా మేనేజర్ ఆదినారాయణ, బ్రాంచ్ మేనేజర్ పవన్‌కళ్యాణ్, డివిజన్ ఆఫీసర్ జగదీష్, లైజన్ ఆఫీసర్ రమేష్ బాబు తదితరులు పోలీస్‌స్టేషన్‌కు 15 బ్యారి కేడ్లు, రెండు త్రీ సీటింగ్ కుర్చీలు శుక్రవారం అందజేశారు. అలాగే రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు 45 కుర్చీలు, రెండు మ్యాట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మన్న, ఎస్‌ఐ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.